# ఆంధ్ర సంస్కృతి వికాసం

నండూరి రామకృష్ణమాచార్యులు

నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

# ఆంధ్ర సంస్కృతి వికాసము

నండూరి రామకృష్ణమాచార్య

**నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

**రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి**

ఆంధ్ర సంస్కృతి వికాసము

నండూరి రామకృష్ణమాచార్య

ప్రకాశకులు:
సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ప్రథమ ముద్రణ 1976
మలి ముద్రణ 2012
ప్రతులు : 5000

మూల్యం : రూ. 76-00

ముద్రణ :
శ్రీ విజయ దుర్గా ప్రింటర్స్
హైదరాబాద్

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

**ముఖ్యమంత్రి**
**ఆంధ్రప్రదేశ్**

## సందేశం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 27–29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్యక్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగువారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికీ ఈ మహాసభలు ఎంతోగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాము.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ప్రపంచ సభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగువారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవవైవిధ్యసదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారతదేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశవిదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు సమాయత్తమైంది. ఈ సభలలో సదస్సులు, తెలుగువారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితకళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు, పుస్తక ప్రచురణ కూడ పెద్ద యెత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతున్నది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశాల సందర్భంగా ప్రచురించే లఘుగ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాము.

కిరణ్ రెడ్డి
(యన్.కిరణ్ కుమార్ రెడ్డి)

**V. VASANT KUMAR,** B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899

# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచుకునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించి సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే 'ప్రపంచ తెలుగు మహాసభల' నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల పునశ్చరణ, వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వసిస్తున్నాను.

వట్టి వసంతకుమార్

# అనుక్రమణిక


| | | | |
|---|---|---|---|
| 1. | విన్నపము,తెలుగుతల్లి,ఆరాధన | ... | 2 |
| 2. | ఆంధ్ర సంస్కృతి వికాసము | ... | 7 |
| 3. | తెలుగు దేశము - ఎల్లలు | ... | 12 |
| 4. | భారతదేశ చరిత్రలో ఆంధ్రులు నిర్వహించిన భూమిక | ... | 28 |
| 5. | ఇక్ష్వాకులు | ... | 40 |
| 6. | ఆంధ్ర శాతవాహన యుగములో ఆంధ్ర సంఘవృత్తలుము | | 43 |
| 7. | చాళుక్య సామ్రాజ్యము | ... | 66 |
| 8. | తిక్కన మహాకవి | ... | 78 |
| 9. | తెలుగు కవులు | ... | 89 |
| 10. | భువనవిజయము | ... | 108 |
| 11. | అవధానములు | ... | 119 |
| 12. | ఆంధ్రుల అభిరుచులు | ... | 131 |
| 13. | ఆంధ్ర సంస్కృతి - లలితకళలు-శిల్పము | ... | 155 |
| 14. | ఆంధ్ర చిత్రలేఖనము | ... | 169 |
| 15. | ఆంధ్ర నాట్యకళ | ... | 174 |
| 16. | ఆంధ్ర గానకళ | ... | 179 |

# తెలుగు తల్లి

నండూరి రామ కృష్ణమాచార

1. కవుల కంటె – తుహిన కర్పూర నిభ కీర్తి
తెచ్చి రెవరు నీకు తెలుగు తల్లి ?
సాహితీ తరంగ సంగీత రసధుని
దేశ భాషలందు – తెలుగు లెస్స !

2. తరపి వెన్నెల – ఆణి ముత్యాల జిలుగు;
పునుగు జవ్వాజి – ఆమని పూల వలపు;
మురళి రవళులు – కస్తూరి పరిమళములు
కలసి మేర్పడె సుమ్ము – మా తెలుగు భాష !

3. జయము జయము – తెలుగు తల్లి
ప్రియతమ ధాత్రీమ తల్లి ॥జయము॥

అరుణోదయ కిరణోజ్జ్వల
రాగ రచిత రంగవల్లి
పసిడి పలుకు – పాలవెల్లి !
లలితా కళా కల్పవల్లి ! ॥జయము॥

కదలి తేడు – కడుగును నీ
కాళ్ళను కెరటాల నీళ్ళ;
కళ్ళకద్దుకొను – నీ తల
గగనము – ఉల్లాసముతో ॥జయము॥

వంశధార – నాగావళి
వసంత సౌరభములతో
ధగధగలాడును – నీ నును
సిగ – మల్లెల మాలలుగా
గోదావరి పూదండగ;
క్రాలును – నీ గళ మందున
కృష్ణవేణి – కింకిణీక
మణివేఖల – మార్ మ్రోగును;
చెన్నారును – స్వర్ణముఖీ
పెన్నలు – మంజీరములై; ॥జయము॥

నీలో భారతదేశపు
నాలుగు దిక్కులు – కలిసెను !
సమన్వయ సవిత్రి వీవు !
సహన నేత్రి వీవు సదా ॥జయము॥

ప్రాజ్య మగధ రాజ్యములో,
ఉజ్జయినీ గగనములో,
నీ విజయ ధ్వజ మెగిరెను !
నీ దుందుభి నినదించెను;
జరిపినారు – ఇక్ష్వాకులు
శతసహస్ర హల దానము
మా జనయిత్రివి నీవే
మధుర ధరిత్రివి నీవే !
అక్షయ పాత్రవు నీవే !
అమృత చరిత్రవు నీవే ! ॥జయము॥

పుట్టినారు – నీ కడుపున
బోధి సత్వ మేధావులు,
సారస్వత – సమరాంగణ
సార్వభౌమ బిరుదాంకులు;
దయావీర దానవీర
ధర్మవీర ధాన్యాత్ములు ! ॥జయము॥

వాదాలకు వారధివై,
భేదాలకు స్వస్తి చెప్పి,
కొత్త పాతలకు – కూరిమి
కూడలివై – వర్ధిల్లుము;
కవితారస కల్యాణీ !
గానామృత మయవాణీ !
సస్య శ్యామల గృహిణీ !
సర్వ హితాభిలాషిణీ ! ॥జయము॥

# ఆరాధన

1. పూర్మాంభోనిధీ కాళహస్తి నగరీ - శ్రీమన్మహేంద్రాచలః
శ్రీ శైల ప్రముఖ త్రిలింగ శిఖరీ ప్రాతర్నవోష స్వినీ
కృష్ణా కంకణ కింకిణీ ఝుణ ఝుణద్ గోదావరీ కాంచికా
ద్రాక్షాపేశల వాఙ్మయీ ! విజయతాం ! త్రైలింగ పృధ్వీ స్థలీ !

2. జయతు వింధ్యాచల కిరీటా - జయతు స్వర్ణముఖీ నదీ మం
జీర శింజిత మంజు మంజుల చరణ కంజాతా

3. ధర్మ శూర సుత ప్రసూతే - దేశ భాషాతి శయ కవితా
రస నిభృత నిర్ఝర సమేతా - జయతు ప్రియమాతా

4. ఖడ్గ వీరాః కార్యశూరాః - సాహితీరణ సార్వభౌమాః
బోధి సత్వాః తవప్రియ సుతాః - పూజ్యమాతృధరే.

5. ఔత్త రాహ రసార్ద్ర హృదయం - దాక్షిణాత్య విదగ్ధ మేధా
తవ శెభగ దరళ మంగళ - సూత్రయుగళ దళే

6. యత్ర భాషణ కరణ శెద్ధిః - యత్ర కరుణార్ద్రానుభూతిః
తత్ర కృపయా సర్వదాస్మాన్ - గమయ ప్రియమాతః

7. యత్ర దాస్యం నాస్తి భావే - యత్ర విశ్వ హితైకదీక్షా
కార్యరూప నిరంతరా స్యాత్ - తత్ర గమయ సదా

8. హృద్విధేయా యత్ర ధిషణా - యత్ర హేతుః సంప్రదాయ సు
వర్ణ నిగళక బంధ ముక్తః - తత్ర గమయ సదా !

9. సంగీదార్ద్రా మధు రసధునీ కావ్యలావణ్యపూర్ణా
శ్రీమన్నాగార్జున నగ కళా శిల్ప సాహిత్య ధాత్రీ
త్యాగబ్రహ్మ ప్రగదిత మహాగాన సామ్రాజ్య రాజ్ఞి
విశ్వాదర్శా విజయతు విశాలాంధ్ర పృధ్వీమతల్లీ !

.......

# నండూరి రామ కృష్ణమాచార్యులకు
# కవితా కర్పూర నీరాజనము

శ్రీ గురుం కవితాన్న శ్రీ దాయకమ్ రామకృష్ణమ్

ఆచార్య పురుషం వందే నమ శ్శిరసా ముదా ॥

– బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ

తన చూపులోని స్నిగ్ధత శిష్యహృత్ కంజ
వాత్సల్య సూర్య బింబమ్ము గాగ,
తన పల్కులోని మార్దవము వాఙ్మయ గంగ
జనియించు నీహార మనగ,
తన దరహాస ముద్ర – కవిత్వ గగన రా
కాచంద్ర సాంద్ర విక్రాంతి గాగ,
తన కీర్తి – శరదంబర నితాంత కుంద ము
క్తాహార విదిత సంక్రాంతి గాగ;
అలరు విద్యార్థి కల్పకంబగు మహర్షి,
భూరి కరుణాస్పదుండు నండూరి బుధుడు;
సంస్కృతాంధ్రాంగ్ల నందనాంచద్విహార
సరసమతి రామ కృష్ణమాచార్య సుకవి.

– డాక్టరు మేడసాని మోహన్

శీర్ణ మేఖలా కావ్య సృష్టి కర్త;
తెలుగు నధికార భాషగా తీర్చు నేత;
వేల శిష్యుల హృదయాల వెలుగు మాత;
రామ కృష్ణుడు ధీరస రాజ్య దాత.

– డాక్టరు గరికపాటి నరసింహారావు

# విన్నపము

విషయసంకలనము విజ్ఞానమా? కాదు!
ఇటుక అమ వేఱు! ఇల్లు వేఱు!
అస్తిపంజరమ్ము అసలు దేహము కాదు.
రమ్యహాసలోల! రామకృష్ణ!

-ప్రగతి గీత.

ఆంధ్ర సంస్కృతిని అర్ధముచేసికొనుట ఆంధ్రులకు ఆవశ్యకర్తవ్యము. ఆంధ్ర జీవితమును సాంగోపాంగముగ సమీక్షించు ఉద్గ్రంధములు ఎన్నో ఉన్నవి. ఉత్కృష్ట రచనలు, విజ్ఞాన సర్వస్వములు వెల్లివిరిసినవి. అనేక విషయములపై పరిశోధనలు సల్పిన ప్రజ్ఞాధురీణులు విలువగల పుస్తకములు వ్రాసియున్నారు.

ఎందరో మహానుభావులు
అందరకును వందనములు.

ఆంధ్ర చరిత్రకు ఆంధ్ర సామాజిక జీవితమునకు అంతర్వాహినియై జీవనాడివలె స్పందించు ఆంధ్రత్వమును అనుశీలించు "సంగ్రహ సమీక్ష" యొక్క ఆవశ్యకతగూర్చి జిజ్ఞాసువులైన పలువురు మిత్రులు పలుమారు రచయితతో ప్రస్తావించుట జరిగినది అట్టి గ్రంథము వ్రాయుటకు ముప్పదేండ్లు తెలుగు పండితుడుగా జీవితయాత్ర గడిపిన రచయిత అర్హతగల అధికారియని ప్రోత్సాహ వాక్యములు పలికిన ఆప్తులుగూడ ఉన్నారు. ఆప్తవాక్యము కర్తవ్యముగా స్వీకరించి ఆంధ్రపండిత త్రిదళుడైన ఈ రచయిత తనజన్మ సార్థకము చేసికొనుటకు వ్రాసిన చిరుపొత్తము "ఆంధ్రసంస్కృతి వికాసము".

ఆంధ్రుల చరిత్రకు - కళలకు - లలితకళలకు - విద్యలకు - విజ్ఞానమునకు సాహిత్యమునకు, సంస్కృతికి ప్రాణప్రతిష్ట కల్పించి - ఆంధ్ర సామాజిక

జీవితమునకు నవనోన్మేష ప్రాయమై అంతర్లీన చైతన్య స్రవంతిగా భాసించు తెలుగు వెలుగును ప్రస్తరించి ప్రదర్శించుటయే యీ రచనకు ధ్యేయము.

విశ్వ విఖ్యాతికెక్కిన విక్రమాదిత్య చక్రవర్తిపై విజయము సాధించి ఉజ్జయినిపై ఆధిపత్యము వహించి భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమైన నూతన యుగమును శాలివాహనశకమును ప్రారంభించిన జగదేకవీరుడు ఆంధ్ర శాతవాహన సార్వభౌముడని ఆంధ్రులు గర్వస్ఫూర్తితో భారతదేశ చరిత్రను అనుశీలించవచ్చు.

ఆంధ్రదేశమునే గాక దక్షిణాపథము నంతటిని అవిచ్ఛిన్నముగా ఐదు శతాబ్దులపాటు పరిపాలించి యావద్ భారతవర్షము ఏకచ్ఛత్రాధిపత్యము వహించిన మగధ సామ్రాజ్యమును సయితము జయించి అలనాడు ఆసేతు హిమాలయము ఆంధ్రశాతవాహన సామ్రాజ్యము విస్తరించిన సంగతి సంస్మరించిన ఆంధ్రులు ఉప్పొంగుట సహజము.

ప్రపంచములోకెల్ల గొప్పవజ్రము కోహినూరు జన్మభూమి ఆంధ్రదేశమని, జగదేక గాయక సార్వభౌముడైన త్యాగరాజు ఆంధ్రుడని, భౌగోళికముగా భారతదేశ మధ్యములో ఉన్న ఆంధ్రభూమి సర్వమతములకు సమన్వయక్షేత్రమైన ధర్మాద్వైత వేదాంతసీమ అని ఉబ్బితబ్బిబ్బగుచు తెలుగుతల్లిని ఆరాధించుట తెలుగుబిడ్డల పవిత్ర కర్తవ్యము.

భారతదేశ చరిత్రలో ఆంధ్రులు నిర్వహించినపాత్ర ఉగ్గడింప దగినది. భారతదేశ చరిత్రకారులు పాఠ్యగ్రంథములలో ఆంధ్రచరిత్రకు గల్పించవలసిన ప్రాధాన్యము కల్పించలేదు. చరిత్రలో ఎన్నోసార్లు భారతీయ సంస్కృతికి ఆంధ్రభూమి ఆశ్రయమిచ్చి రక్షించినది.

ఆశోకుని తర్వాత పుష్యమిత్రశుంగుడు తాత్కాలికముగా సనాతన వైదిక మతమును పునురుద్ధరించినను బౌద్ధమును తనరాజ్యమునుండి తరిమివేసినాడు. ఆ బౌద్ధమునకేగాక శుంగుల తదనంతరము యవన శక పహ్లవక్షహరాటాది

ప్రతీ పాక్రాంతమైన ఉత్తరాపథమునుండి వలసవచ్చిన సనాతన సంస్కృతికి గూడ ఆంధ్రదేశమే శరణ్యమైనది.

ఆంధ్రదేశమున అట్టి చరిత్ర పలుమార్లు పునరావృతమగుట వేత్తలకు అనారుధ విషయముగాదు.

గజనిమహమ్మదు తరిమికొట్టినపుడు- గోరీమహమ్మదు కన్యాకుబ్జము నాక్రమించినపుడు, ప్రతికూల సభ్యతా ఝంఝూమారుతములు సింధునదినుండి గంగానది మైదానమును ఆక్రమించినపుడు భారతీయసభ్యత సనాతన సంస్కృతి ఆంధ్రభూమికి వలసవచ్చి అతిథి సత్కారములనంది అభ్యుదయ పరంపరాభివృద్ధి నొందినవి. క్రీస్తుశకము పదునొకండవ శతాబ్దినుండి భారతీయ సంస్కృతిని సుమారు వేయిసంవత్సరములు పరిపోషించి పరిరక్షించినది ఆంధ్రులు. యావద్భారతము అసేతు హిమాలయము ప్రతికూల సభ్యతకు సంస్కృతికి దాసోహము కొట్టిన విపత్కాలములో భారత సంస్కృతిని రక్షించి సజీవముగా నిలిపినది విద్యానగర సామ్రాజ్యము. విద్యానగర సామ్రాజ్యమున ఆంధ్రులు నిర్వహించిన ప్రధాన భూమిక చరిత్రకు సుగమము. విజయనగరసామ్రాజ్య పతనానంతరముగూడ తంజావూరు, పుదుక్కోట, మధురలలో భారతీయ సంస్కృతి ధ్వజమును అవనతము గాకుండ ఎగురవేసినది ఆంధ్రులే.

ఆ మహోజ్వలచరిత్రను అనుశీలించి దేదీప్యమానమైన 'తెలుగువెలుగు'కు పులకాంకుర ప్రకరాలతో కవితా కర్పూర నీరాజనము సమర్పించినచో తెలుగు వారు లోకోత్తర కార్యనిర్వహణకు స్థిరదీక్షతో పురోగమించు ధీరోదాత్త నాయకులు కాగలరు.

"ఆంధ్రసంస్కృతి వికాసము" అను ఈ గ్రంథమునకు ధ్యేయము ఆంధ్రులలో ఆంధ్రసంస్కృతిపై "అభిమానము" రేకెత్తించుటయేగాని అనర్థమూలకమైన "అహంకారమును" పెంపొందించుట కాదు.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" - కావున ఆంధ్రులు తెలుగు వెలుగును ఆరాధించుట సహజము.

"కన్నుదోయికి అన్య కాంత లడ్డంబైన
మాతృభావము చేసి మరలువాడు"

తెలుగు ప్రహ్లాదుడు తెలుగు వెలుగు హృదయ కుహరాంతరాళములో వెల్లివిరిసిన ఆంధ్రుడు - స్వదేశీయములైన తమిళ, కర్ణాట, మళయాళ, మహారాష్ట్ర ప్రభృతి సంస్కృతులుగాని విదేశీయులైన అన్య సంస్కృతులుగాని తారసిల్లినను మాతృభావనతో నమస్కరించు నట్టివాడే యగును. అసలు సంస్కృతికి ఎల్లలే లేవు.

విశ్వమానవ సౌభ్రాతృత్వము- సమానత్వము- స్వాతంత్ర్యము ఏదేశ సంస్కృతికైనను జీవనాడులు భారతీయ సంస్కృతి విశ్వమానవ సంస్కృతిలో అంతర్భాగము. ఆంధ్రసంస్కృతి ఆ భారతీయ సంస్కృతిలో అవిభాజ్యమైన జీవధార.

ఐక్యమత్య మున్నప్పుడు భారతదేశము పురోగమించినది. అంతచ్ఛిద్రములున్నప్పుడు భారతదేశము తిరోగమించినది- ఇది భారతదేశ చరిత్ర నేర్పిన యేకైక గుణపాఠము విస్మరింపరానిది.

ఆంధ్రభాష గొప్పది. యాథార్థ్య మరసిన అన్ని భాషలు గొప్పవే. ఆంధ్ర చరిత్ర దేదీప్యమానమైనది. అన్నిదేశములందలి చరిత్రలలో దేదీప్యమానమైన ఘట్టములుండకపోవు. కాని దేశభక్తి భౌగోళికమైన "విగ్రహారాధన" కారాదు.

"ఆంధ్ర సంస్కృతి వికాసము" లో ఎచ్చటను ఏ దేశమునుగాని, ఏ సంస్కృతినిగాని అధిక్షేపించుచున్న అక్షరము ఒక్కటైన లేదని మనవి. ఈ గ్రంథములో ఆంధ్రుల ఔన్నత్యమునుగూర్చి వ్రాసిన అంశములలో ఎవరికైన అంగీకార్యములు కానివి ఉన్నచో అవి రచయిత అజ్ఞానమునకే ఆరోపింతురు గాక! పక్షపాతమునకు వలదు. 'కన్న తల్లి' ని పూజించు పుత్రుడే, ఏతల్లిలో నైన జగన్మాతృస్వరూపమును

సందర్శించగలడు అని రచయిత విన్నపము.

చెరిపివేయు మన్ని సరిహద్దు గీతాలు
పుడమిలోన మనిషి యెదదలోన
అసలు పెద్దమనిషి వసుధైక పౌరుడు
మంచితనమె పెద్దమనిషి మతము.

- నందూరి రామకృష్ణమాచార్య.

# ఆంధ్ర సంస్కృతి వికాసము

"దేశ భాషలందు తెలుగు లెస్స" - శ్రీ కృష్ణదేవరాయల అభిభాషణము తెలుగువారి గుండెలలో నిరంతరము ప్రతిధ్వనించుచుండుట సహజము. సాహితీ సమరాంగణ సార్వభౌముడు, అలనాడు ఆముక్తమాల్యద పీఠికలో అన్నమాట- ఆంధ్రుల ఆత్మాభిమానమునకు మేలుకొలుపు పాట అయినది. కటకమునుండి కన్యాకుమారివరకు ఎత్తిన కత్తికి ఎదురులేకుండ దిగ్విజయయాత్ర సాగించినట్టి జగదేక వీరుడు, దేవ దుందుభులు మారుమ్రోగునట్లు భువనవిజయ సభా భవనములో సాహిత్య సింహాసనముపై తెలుగు భాషకు పట్టాభిషేకము గట్టినాడు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానములో దక్షిణాపథములోని సామంత రాజ్యాలు పరిపాలించుచున్న ప్రభువులు ఎందరో ఉన్నారు. వారందరు వివిధ దేశభాషలు మాటలాడువారు. చక్రవర్తియైన శ్రీకృష్ణదేవరాయలు బహు భాషా కోవిదుడు. అన్ని భాషల అంతస్తత్త్వములు మధించి భువనవిజయములో సాహితీ విక్రమాదిత్య సింహాసనముపై అధివసించి న్యాయాధిపతిగా చెప్పిన తీర్పు "దేశభాషలందు తెలుగు లెస్స"

ఎవరి మాతృభాష వారికి మృదు మధురముగా నుండవచ్చును. కన్నడిగులు- "కన్నడము కస్తూరి", అని మురిసిపోవుచున్నారు. అయిన శ్రీకృష్ణ దేవరాయులు చెప్పిన తీర్పునకు కారణము స్వాభిమాన పూరితమైన మాతృభాషాభిమానామా?

శ్రీకృష్ణదేవరాయులు తెలుగు దేశమునకు ఏలికయైనను తాను కర్ణాట ధాత్రీపతిననియే చెప్పుకొనినాడు, ఆముక్తమాల్యదలో తొలి ఆశ్వాసము చివరి పద్యము అనుశీలింపదగినది.

ఇది కర్ణాట ధరా ధృతి స్థిర భుజా హేవాక లబ్ధేభరా
దుదయోర్వీధర తత్కృవ్య కృత నవ్యోపాయనోష్ణీష ర

త్నదృగంచత్పద కృష్ణరాయ వసుధాధ్యక్షోదితాముక్తమా

ల్యద ఆశ్వాసము హృద్యపద్యముల నాద్యంబై మహింబొల్పగున్.

పై పద్యములోని ముఖ్యాంశములు.

1. శ్రీ కృష్ణదేవరాయులు కర్ణాట సమ్రాట్టు.

2. అతని పాదములు ఉదయగిరి దుర్గాధిపతి-గజపతి పినతండ్రి సమర్పించిన సరిక్రొత్తకానుక-రత్న కిరిట కాంతులచే వెలుగొందినవి.

3. అది తాను రచించిన అముక్తమాల్యదలో ప్రథమాశ్వాసాంతము.

శ్రీకృష్ణదేవరాయుల ఉదయగిరి దుర్గ విజయము దక్షిణాపథమున జరిగిన అద్భుత సన్నివేశములలో ఒకటి ఉదయగిరి దుర్గాధిపతి-ప్రహరేశ్వరపాత్రుడు-కళింగచక్రవర్తి గజపతికి పినతండ్రి విజయనగర సేవలు నాలుగు నెలలు ముట్టడించినను ఆ గిరిదుర్గము లొంగిపోలేదు. చివరకు శ్రీకృష్ణదేవరాయలే ఒకనాడు తన సేనలకు నాయకత్వము వహించి దుర్గాధిపతి శిరస్సు ఖండించి, దానిని తన కాలితో తన్నిగాని స్నానము చేయనని ప్రతిజ్ఞ చేసినాడు. సప్తప్రాకారములలో మూడవ ప్రాకారము కూలిపోవగానే ప్రహరేశ్వరపాత్రుడు లొంగిపోయి రాయల శరణు వేడినాడు. శరణార్థి శిరస్సు ఖండించుటా? కానిచో ప్రతిజ్ఞాభంగమునకు పాల్పడుటా? శ్రీకృష్ణదేవరాయులు సందిగ్ధావస్థలో పడినప్పుడు తిమ్మరుసు చెప్పిన నిష్కృతి-ఉదయగిరి దుర్గాధీశుని శిరస్సుకు బదులుగా కిరీటమును తన్ని ప్రతిజ్ఞాపాలన చేయవచ్చునని రాయలవారు ఆవిధముగా "లబ్ధేభరాడుద యోర్వీధర తత్పితృవ్యకృత నవ్యోపాయనోష్ణీష రత్న దృగంచత్పదుడై" ప్రతిన నెరవేర్చుకొన్నాడు. శ్రీకృష్ణదేవరాయల వ్యక్తిత్వ మట్టిది. మెరమెచ్చులకు మాటలాడువాడు కాడు. అట్టి శ్రీకృష్ణదేవరాయలు అన్నమాట 'దేశభాషలందు తెలుగు లెస్స'.

కన్నడులు-శ్రీకృష్ణదేవరాయలు కర్ణాటకుడనియే వాదింపవచ్చు. అతని మాతృభాష కన్నడమే కావచ్చు. తెలుగు తన మాతృభాష కాకపోయినప్పటికిని

తెలుగును అంతగా రాయలు మెచ్చుకొనుట తెలుగు గొప్పదనమును ఇనుమడింప జేయుచున్న దను మాట మరువరాదు. ఒక వేళ శ్రీకృష్ణదేవరాయల మాతృభాష తెలుగే అయినచో-అతని మాతృభాషాభిమానము తెలుగువారి కందరికి "మేలుబంతి" కాదగినది.

భువన విజయ సభాభవనములో అష్టదిగ్గజ కవితాసింహాసనములు నెలకొల్పి ఆంధ్రసారస్వతమున స్వర్ణయుగము సృష్టించిన శ్రీకృష్ణదేవరాయలను తేజస్విని చేసినది "తెలుగు వెలుగు". అలనాటినుండి ప్రతి తెలుగు హృదయము ఒక చిఱు భువన విజయముగా వెల్లివిరియుచున్నది. అసలు శ్రీకృష్ణదేవరాయల మాతృభాష కన్నడము కాకపోవచ్చు. తెలుగు కాకపోవచ్చు. భావి పరిశోధనల వలన అతని మాతృభాష 'తుళు' అని తేలవచ్చు. అతని మాతృభాష యేదైనా, ఆ సహృదయ సమ్రాట్టు పులకాంకురప్రకరాలతో కవితా కర్పూర నీరాజనము సమర్పించినది తెలుగు వెలుగుకే.

"దేశభాషలందు తెలుగు లెస్స"-అన్నది తొలుత శ్రీకృష్ణదేవరాయలు కాదు. ఆమాట యుగ యుగాంతరాలుగా దక్షిణా పథమునకు అనుభవ పునరుక్త మైనలోకోక్తి. క్రీడాభిరామములోని ఆ వాక్యమునే శ్రీకృష్ణదేవరాయలు ఉటంకించినాడు. క్రీడాభిరామమునకు మాతృక ప్రేమాభిరామము. దానిని వినుకొండ వల్లభామాత్యుడు ఆంధ్రీకరించినాడు. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు క్రీడాభిరామమును వ్రాసినది కవిసార్వభౌముడైన శ్రీనాథుడని నిరూపించినారు. అయినచో-

"దేశ భాషలందు తెలుగు లెస్స" అన్నమాట శ్రీనాథ మహాకవిదా? శ్రీనాథుడు:

తల్లీ కన్నడ రాజ్యలక్ష్మి దయలేదా నేను శ్రీనాథుడన్-

"నా కవిత్వంబు నిజము కర్ణాటభాష" అను పద్య పాదములను ఉదాహరించి శ్రీనాథుని మాతృభాష కన్నడమని ప్రతిపాదించిన విమర్శకులున్నారు. శ్రీనాథుని

మాతృభాష యేదైనను శ్రీనాథుని కవిసార్వభౌముని చేసినది "తెలుగు వెలుగే"

ఉద్దండ పండితుడుగ–అలంకారిక చక్రర్తిగ పేరుగాంచిన అప్పయ్య దీక్షితుడు తాను తమిళుడైనప్పటికి–

"ఆంధ్రత్వ మాంధ్ర భాషా చ నాల్పస్య తపః ఫలమ్" – అన్నాడు. ఆంధ్రుడై జన్మించుట–ఆంధ్రభాష మాతృభాష యగుట పూర్వజన్మతపఃఫలమని కువలయానందకర్త ప్రవచనము.

ఆధునిక యుగములో తమిళ సారస్వతమున కవి చక్రవర్తిగా కీర్తిచెందిన సుబ్రహ్మణ్యభారతి గనిన సువర్ణ సుందర స్వప్నము ఆంధ్రులందఱకు చిరస్మరణీయము.

తరళ సింధు లహరి తరపి వెన్నెల రేయి
పడవపైన 'తెలుగు పాటపాడి'
మరులు గొలుపనగును మళయాళ మదిరాక్షి!
కలను గనెను తమిళ కవివరుండు.

ఆంగ్లకవయిత్రి–వంగీయుల ఆడుపడుచు–ఆంధ్రుల కోడలు అయిన సరోజనీదేవి–

భారతదేశమున అటు ఉత్తరము ఇటు దక్షిణము మధ్య ఆంధ్రుల నైసర్గిక భౌగోళిక స్థితి సార్థకమైనది. ఆంధ్రుల సంస్కృతిలో అటు ఔత్తరాహుల రసార్ద్ర హృదయము–దాక్షిణాత్యుల విదగ్ధమేధ–రాశీ భూతమై సంగమించినవి అని కొనియాడినది. 1

"ఔత్తరాహ రసార్ద్రహృదయం
దాక్షిణాత్య విదగ్ధ మేధా
తవ శుభ గళే తరళ మంగళ
సూత్రయుగళ దళే॥

"ఓ తెలుగు తల్లీ! సౌభాగ్యవతివైన నీ కంఠమందు దేదీప్యమానముగా

వెలుగుచున్న మంగళసూత్రములో-రెండు దళములలో ఒకటి ఔత్తరాహుల రసార్ద్ర హృదయము, రెండవది దాక్షిణాత్యుల విదగ్ధ మేధ" అని యాభావమునకే సంస్కృతీకరణము పై శ్లోకము.

శ్రీకృష్ణరాయల మాతృభాష అసలు తెలుగుగాని కన్నడము గాని గాక పోవచ్చు. అతని మాతృభాష "తుళు" అని కొందరు విద్వాంసుల అభిప్రాయము. అతని వంశము "తుళు". తుళు లిపిలేని ఒక చిరుభాష. ద్రావిడ భాషాకుటుంబము లోనిదియని అధునాతన భాషాశాస్త్రజ్ఞులు నిరూపించియున్నారు. ఆంధ్ర సారస్వత జగత్తులో ప్రాతఃస్మరణీయులైన కవిత్రయమువలె కన్నడ వాఙ్మయ త్రిమూర్తులు పంప-పొన్న-రన్న-కవులకు రత్న త్రయమని పేరు. వేములవాడ (నేటి కరీంనగరము మండలములోనిది) చాళుక్యరాజు అరికేసరి ఆస్థానపండితుడు "పంపకవి" (కన్నడ భారత కర్త) తన జన్మస్థానము వేంగీమండల మందలి కమ్మ నాటిలోని వేంగిపళ్ళు గ్రామమని కంఠోక్తిగా తన కావ్యమున చెప్పుకొని యున్నాడు. పొన్నకవి-పుంగనూరు ప్రభువైన మల్లపయ్య ఆస్థానకవి. కన్నడ వాఙ్మయ స్రష్టలైన రత్నత్రయములో పంపపొన్న మహాకవులు తెలుగువారే.

---

"Andhras Justify their geographical position between the emotional north and the practical South.

# తెలుగు దేశము - ఎల్లలు

పూర్వాంభోనిధి కాళహస్తి నగరీ శ్రీమన్మహేంద్రాచల
శ్రీశైల ప్రముఖ త్రిలింగ శిఖర ప్రాత ర్నవోషస్వినీః
కృష్ణా కంకణ కింకిణీ ఝుణఝుణద్ గోదావరీ కాంచికాః
ద్రాక్షా పేశల వాఙ్మయీః విజయతాంః త్రైలింగ పృథ్వీస్థలీః

తెలుగు దేశమునకు ఎల్లలు-తూర్పున సముద్రము. ఆంగ్లేయులు-ఆంగ్లమానస పుత్రులైన అధునాతనులు దీనిని బంగాళాఖాతమని వ్యవహరించుచున్నారు ప్రాచీనకాలమునుండి ఈ సముద్రము పూర్వాంభోనిధి, తూర్పుకడలి-అనియే వ్యవహారసిద్ధము. వాఙ్మయ ప్రసిద్ధము. ప్రాచీనకాలమున బర్మా, సువర్ణ ద్వీప వాసులు త్రిలింగ సముద్రమని వ్యవహరించినారు. తీరరేఖనుపట్టి చూచినచో ఈ సముద్రమును ఆంధ్రాఖాతము-ఆంధ్రసముద్రము అని అనవలసి యున్నది. బంగాళఖాతములోని ద్వీపసముదాయములలో జావా, బోర్నియో, సుమిత్ర మున్నగు వానిలో ప్రాచీనకాలమున వెల్లి విరిసినది తెలుగు సంస్కృతియే.

మహాకవి శ్రీ జాషువాగారన్నట్లు-

"అటు జావా ఇటు సింహళంబు వరకున్ వ్యాపించి" నది తెలుగు వెలుగే. ఇక పశ్చిమమున, దక్షిణమున తెలుగు దేశమునకు సరియైన హద్దులు పశ్చిమ సముద్రము-దక్షిణ సముద్రములే. బాణ మహాకవి ఆంధ్ర మహారాజును త్రిసముద్రాధిపతిగా అభివర్ణించినాడు. గౌతమీపుత్ర శతకర్ణి-ఆంధ్ర శాతవాహన చక్రవర్తి వాహనములు త్రిసముద్ర నీరముల గ్రుంకులిడినట్లు రాజమాత శిలాశాసన సాక్ష్యము. అవి అలనాటి ఎల్లలు. ఉత్తరమున ఆంధ్రదేశమునకు సరిహద్దు కన్యాకుబ్జము, అని ఒక ప్రాచీన శిలాశాసనమున నున్నది. ఆంధ్ర శాతవాహనులు ఉజ్జయినిని జయించుట మగధ సామ్రాజ్య రాజధాని పాటలీపుత్రములోని

సుగాంగేయ సౌధములో నివసించి దక్షిణాపథమునంతయు పరిపాలించుట విస్మరింపరాని అంశములు. కుంతలశాతకర్ణి కుంతలమును జయించి పరిపాలించినాడు. తెలుగుదేశమునకు ఎల్లలు ఏవి? అవి ఈనాడు తర్జన భర్జనలుగాని, శ్రీనాథకవి సార్వభౌముడుగూడ;

"చీకటియుంగళింగమును చిల్కసముద్రము" రాజమహేంద్రవర రాజధానిగా నేలిన రెడ్డిరాజుల అధీనములో నున్నట్లు సుస్పష్టముగ చెప్పియున్నాడు. చిలక సముద్రము అన్న పేరు తెలుగుపేరే. ఈనాడు బరంపురము, గంజాము జిల్లాలు ఒరిస్సాలో చేరియున్నవి. నేటి రాజ్యాంగములోని ఎల్లలే తెలుగు దేశమునకు ఎల్లలు కావనునది ఎల్లరెరిగిన విషయమే.

శ్రీకృష్ణదేవరాయుల కాలమున ఒక తెలుగువాడు జానపదుడు పాడిన పాట మరువరానిది.

కొండవీడూ మనదేరా
కొండపల్లీ మనదేరా
కాదని వాదుకు వస్తే కటకం దాకా మనదేరా!

విశ్వనాథుఁడు-ప్రతాపరుద్ర యశోభూషణములో దక్షారామము - శ్రీశైలము - కాళేశ్వరము త్రిలింగములనియు, త్రిలంగ పరివ్యాప్తమైన భూమిని త్రిలింగదేశముగా అభివర్ణించినాడు. అవి ఆంధ్రదేశమునకు ఎల్లలుగా అతడు భావించెనని భ్రమింపరాదు. అవి తెలుగు దేశములోని ముఖ్యమైన క్షేత్రములు ప్రతాపరుద్రుని రాజ్యమునకు అవి ఎల్లలు కావచ్చునుగాని తెలుగుదేశమునకు సరి హద్దులు గావు.

'తెలుగు'-'తెనుగు' శబ్దములు 'త్రిలింగ' శబ్దమునుండి పుట్టినవని కొందఱు పండితులు ఊహించినారు. కొందఱు తెలుగు-తెనుగు నుండియే 'త్రిలింగ' శబ్దము సంస్కృత వాఙ్మయమునకు అధిరోహించినట్లు చెప్పుచున్నారు. ఈ చర్చ విత్తు

ముందుపుట్టినదా? చెట్టు ముందు పుట్టినదా? అన్న సమస్య వంటిది.

తెలుగు భాష సంస్కృతమునుండి పుట్టలేదనియు-తెలుగు ద్రావిడ భాషా కుటుంబమునకు చెందిన స్వతంత్ర భాష యనియు ఆధునిక భాషాశాస్త్రవేత్తలలో అధికసంఖ్యాకు లంగీకరించుచున్న వాదము.

'తెన్'-అను పదమునకు ప్రాచీన ద్రావిడ భాషలో 'దక్షిణము' అని యర్థము. ఇప్పటికీ దక్షిణమునుండి వీచు గాలికి తెలుగులో 'తెమ్మెర' అనియే వాడుక. వేదకాలమునుండి చరిత్రోదయమునుండి ఔత్తరాహులకు తెలిసిన తొలి దాక్షిణాత్యులు ప్రకృతి సహజముగా తెలుగువారే. అందుచే తెలుగువారు తెన్గు - తెనుగువారైనారు. చారిత్రకముగా, భౌగోళికముగా దక్షిణాపథమున సాంస్కృతిక సార్వభౌమత్వము తెలుగువారికి సంక్రమించినది. దిగ్వాచియైన తెలుగు-తెనుగు ఆ ప్రదేశమునను ఆ ప్రదేశమునందలి ప్రజలకు, ఆ ప్రజలు మాట్లాడు భాషకు పర్యాయపదమైనది. తెనుగు లేక తెలుగు పదము త్రిలింగమునుండి లేదా త్రిక-లింగనుండి లేదా త్రి-కళింగ నుండి పుట్టినట్లు ఎన్నో ప్రజ్ఞావాదములు బయలుదేరినవి. 'వినదగు నెవ్వరు చెప్పిన'-సారాంశము తెలుగు-తెనుగు పదాలు సమానార్థకములైన పర్యాయపదాలు. అవి భాషావాచకములేకాక జాతి వాచకములు దేశవాచకములు.

అట్లే ఆంధ్రశబ్దము-ఇపుడు ఆంగ్ల భాషావేత్తల ఉచ్చారణ మూలమున "ఆం"ధ్రలో "ఆ" ఏర్పడినదిగాని అసలు శబ్దము "ఆంధ్ర" మే. శ్రీ భావ రాజు వేంకట కృష్ణారావుగారు ఈ విషయము ఎలుగెత్తి చాటుటయేగాక-ఆంధ్రుల దురదృష్టమునకు ఆంగ్ల భాషావేత్తలు అనవసరముగా కల్పించిన దీర్ఘమే కారణము అనిగూడ విశ్వసించినారు. అయితే, ఇపుడు "ఆంధ్ర" శబ్దమే సుపరిచితము. కావున-ఆంధ్రశబ్దము ఇరువదియవశతాబ్దిదే పూర్వపుశబ్దము "ఆంధ్ర"యని గుర్తించుట మంచిది. ఇపుడు-ఎల్లరకు సుపరిచితమైన "ఆంధ్ర" శబ్దమునే వాడక తప్పదు. వ్యాకరణమేగాక వ్యాకరణ శాస్త్రమునకు మూలాధారమైన భాషకూడ

ప్రయోగశరణమే. జనవాక్యము భాషలోగూడ ప్రామాణికము. జనవాక్యం తు కర్తవ్యమ్!

'ఆంధ్ర' శబ్దము తొలుత జాతివాచకముగా బహుళప్రయుక్తము. పురాణములలో శాతవాహన రాజులు ఆంధ్రులుగ, ఆంధ్ర సజాతీయులుగ, ఆంధ్రభృత్యులుగ అభివర్ణితులు. ఐతరేయ బ్రాహ్మణములో ఆంధ్రులు విశ్వామిత్ర సంతతిగ సంకరులుగ చెప్పబడినారు. మనుస్మృతిలో భాగవతములో ఆంధ్రుల ప్రశంస కలదు. అయితే ఆ ఆంధ్రులు-నేటి ఆంధ్రులు ఒకరేనా? ఎవరు చెప్పగలరు? సముద్రతీరములో ఏది గంగాజలము? ఏది గోదావరి జలము? ఏది కావేరి జలము? తొలుత జాతి వాచకముగా ప్రయుక్తమైన ఆంధ్రశబ్దము-కాలక్రమమున భాషాపరముగా, దేశపరముగా బహుళ ప్రచారము నందినది.

ఆంధ్ర కవిత్వ విశారదుండు విద్యాదయితుండు మహితాత్ముడు నన్నయ భట్టు అని తిక్కన మహాకవి ప్రస్తుతించినాడు. తెలుగు భాషాపరముగ తిక్కన నాటికే ఆంధ్రశబ్దము స్థిరపడినది జాతిపరముగ పురాణకాలమునుండి సుప్రసిద్ధము. ఆంధ్ర జాతికి సంబంధించిన ప్రదేశము-ఆంధ్రప్రదేశమైనది. ఇక ఈ ఇరువదియవశతాబ్దిలో ఆంధ్రశబ్దమును తెలుగుశబ్దమును వేరుచేయలేము. శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానకవి "ఆంధ్ర కవితా పితామహుడు" శ్రీకాళహస్తి వాస్తవ్యుడైన ధూర్జటిని గూర్చి శ్రీ రాయలవారే "స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గెనో ఆతులిత మాధురీమహిమ" అని ప్రశంసించిన సంగతి జగద్విదితము.

"తెలుంగునన్ మహాభారత సంహితారచన బంధురుండయ్యె జగద్ధితంబుగన్"-

ఆదికవి నన్నయభట్టు: కావున-కాలచక్రమును వెనుకకు త్రిప్పుటకు యత్నించుటకంటె తెలుగు - తెనుగు ఆంధ్రశబ్దములు పర్యాయ పదములని గ్రహించుట మంచిది. శ్రీమదాంధ్ర మహాభాగవతమును వ్రాసిన పోతన మహాకవి, తెలంగాణాకవి అని, పెద్దన రాయలసీమ కవితాపితామహుడని వింగడించుట

అవివేకము. అందఱు ఆంధ్ర వాఙ్మయ నిర్మాతలైన మహానుభావులు. వారి రచనలు తెలుగువారి ఉమ్మడిసొత్తు.

ఆంధ్ర శబ్దమునుగాని తెలుగు-తెనుగు శబ్దములనుగాని నిర్వచించుట కష్టసాధ్యమైనను నిర్దేశించుట సులభము. ఆ శబ్దములు అందరకు తెలిసినవే అర్థము అందరకు సువిదితమైనదే. భౌగోళికముగా ఆంధ్రదేశము భారతదేశములో ఇటు ఉత్తరము - అటు దక్షిణము; ఇటు తూర్పు - అటు పడమర దిక్కులకు మధ్యగ నుండుటచేత భారతీయ చరిత్రలో భారతీయ సంస్కృతిలో విశేష ప్రముఖ పాత్రను నిర్వహించుట సహజసిద్ధము. ఆసేతు హిమాలయము - ప్రాక్పశ్చిమ సముద్ర తీరములకు ఏ ఉద్యమము - ఒక దిక్కునుండి వేరొక దిక్కునకు పయనించినచో ఆంధ్రదేశమున ఆతిథ్యము తీసికొని అలుపు తీర్చుకొనక తప్పదు. ఇది భూతభవిష్యద్వర్తమాన చరిత్రకు అంతరాత్మయైన సత్యము. అసలు భారతదేశమనిన ఉత్తర భారతదేశవే ఎన్నటికీ కాజాలదు. ఉత్తరాపథమునకు వచ్చిన ప్రాముఖ్యము ఈ మధ్యదే. అదియు తాత్కాలికము. అసలు ఉత్తరాపథము - ప్రపంచములోనికెల్ల ఉన్నతోన్నతమైన హిమాలయ పర్వతపంక్తులు కాంచన గంగా గౌరీశంకర శిఖర పరంపరలు. ఉద్భవించనినాడు -లేదా సముద్రగర్భములో అణగిపోయి ఉన్నపుడు దక్షిణ భారత ద్వీపకల్పము ప్రాక్తన మానవ నాగరికతతో విలసిల్లియున్నది. గోదావరి, కృష్ణా, కావేరీ నదులకు- గంగానది అక్కగారుకాదు. వయసులో చిన్నారి చిరుతచెల్లెలు. గంగా సింధుమైదానమనునది భూగోళమున అవతరించుటకు పూర్వమే దక్కను పీఠభూమిపై ఆంధ్రదేశము వివిధ పర్వత పంక్తులతో గోదావరి కృష్ణా తుంగ భద్రా పినాకినీ నదులతో స్థిరరూపము దాల్చియున్నది.

భూగోళమున తొలి మానవుడు ఎపుడు ఎక్కడ ఉద్భవించెననునది చరిత్రకారులు ఇంతవరకు పరిష్కరించలేకపోయిన సమస్య. తొలి రాతియుగ మునకు చెందిన ప్రాక్తన మానవుని సమాధులు ఆంధ్రదేశమున పలుతావులలో

లభించినవి. కృష్ణా గోదావరి తుంగభద్రా నదీగర్భములు ప్రాక్తన మానవునకు ఆటపట్టులు, అంతేగాక పరిణామ వాదమును బలపరచు సాహిత్య సాక్ష్యము ప్రపంచములో వేరొకచోట లభించనట్టిది రామాయణము ప్రసాదించుచున్నది. వానరరాజ్యము-పంపాసరోవర ప్రాంతము- తుంగభద్రా నదీతీరములందు విలసిల్లినది వానరులైన వాలిసుగ్రీవాదులు-నరునకు పరిణామ క్రమమున పూర్వికులు. ఆధునాతన పురాతత్వ పరిశోధకులు-వానర కంకాళమును భూగర్భమునుండి కనుగొనుటకై చేయుకృషి ఆంధ్రదేశమునందే సఫలము కావచ్చు. పురాతత్వజ్ఞులు భావిపరిశోధనలవలన తేల్చదగిన విషయము. ఆంధ్రదేశమున జీవకోటి ఉత్తర భారత దేశమునకంటె ముందుగనే ఉద్భవించి వర్ధిల్లినదనుట భూతార్థము. ఆంధ్రము భూగోళమునందలి ప్రాచీనతమ భూఖండములో ఒకటి. ఇచట ప్రాత రాతియుగము క్రీ॥పూ॥ 5,00,000 సంవత్సరములకు ముందే వర్ధిల్లినదని చరిత్రజ్ఞుల అభిప్రాయము. అప్పటి వాతావరణమునకు ఇప్పటి వాతావరణమునకు మిక్కిలి వ్యత్యాసమున్నదనుట నిశ్చయము.

క్రొత్త రాతియుగమునకు సంబంధించిన కొఱముట్లు డోర్నకల్లు-ఆత్మకూరు కనుమదగ్గర గిద్దలూరు దగ్గర దొరికినవి.

బేతంచర్లకు దగ్గరగాఉన్న బిల్లసర్గం కొండగుహలలో ప్రాక్చారిత్రక యుగములకు సంబంధించిన జంతువుల అస్తిపంజరములు-శిలాయుగ పరికరములు దొరికినవి. వ్యవసాయమునకు అలనాటి మానవులు ఉపయోగించిన రాతి గొడ్డళ్ళు రాతి నాగలి కఱ్ఱు-దాని చివరకట్టిన సూదిరాయి ముఖ్యముగా పేర్కొనదగినవి. ఈ విషయముపై శ్రీ బెండపూడి సుబ్బారావుగారు విశేష పరిశ్రమచేసి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వములో ఒక వ్యాసము వ్రాసియున్నారు.

ఆంధ్రదేశమున కృష్ణా, గోదావరి, చిత్తూరు, బళ్ళారి అనంతపురము, కర్నూలు మండలములలో ప్రాచీన సమాధులు-రాక్షసిగుళ్ళు-పీనుగు తొట్టెలు కనుగొనబడినవి. భారతదేశమునందంతటిలో అద్వితీయము-అసమానమునైన

శవపేటిక కడప మండలములో శంకవరములో బయలుపడినది. ఇది గొట్టె అకారముగల ఆరుకాళ్ళ పెట్టె. ఉత్తరాపథమున- గంగా సిందుమైదానము నిర్జన స్థలముగ ఉన్నపుడే, అనగా ఆర్యులు ఆర్యావర్తమున ఆవాస మేర్పర కొనక ముందే దక్షిణాపథమున ఆంధ్రదేశమున ప్రాక్తన మానవులు కృష్ణ, దావరి, తుంగభద్ర లోయలలో వర్ధిల్లినారు.

ఆంధ్రదేశములోని ముఖ్యనదులు గోదావరి, కృష్ణ, త ద్ర, పెన్న.గోదావరికి గౌతమి అని నామాంతరము. గోదావరి మహాత్మ్య పురాణములో అభివర్ణితము. గోదావరి జన్మస్థలము నాసికాత్ర్యంబక గోముఖమునుండి సన్నని ధారగ వెలువడి పంచవటి దాటి ప్రతిష్ఠానమును చేరుచున్నది. పూర్ణ-మంజీర-ప్రాణహిత-పెన్గ పెయిన్గంగ కిన్నెరసాని మున్నగు ఉపనదులను చేర్చుకొని భ చేరుచున్నది. తర్వాత గోదావరిలోకలసిన ముఖ్యమైన ఉపనది శబరి పాపికొండలను దాటి రాజమహేంద్రవరమును చేరుచున్నది. మహానది-సుమారు మూడు నాలుగు మైళ్ళు ఇటునటు పాపికొండల కైనలోయల నుండి ప్రవహించుట ప్రపంచమందలి అద్భుత రమణీయ ధ్ర నెన్నదగినది. ప్రపంచయాత్రికుల నాకర్షించి ఆశ్చర్యచకితులను చేయగ యాత్రాస్థలముగ దానిని అద్యతన భవిష్యత్తులో రూపొందించుట ఆంధ్ర కర్తవ్యము. గోదావరిపై ధవళేశ్వరమువద్ద - శతాబ్దికి పూర్వము శ్రీ కా నిర్మించిన ఆనకట్ట - నేడు పునర్నిర్మాణ దశలోనున్నది. అచ్చటినుండి - వాసిష్ఠ - విశ్వామిత్ర - వామదేవి - గౌతమి - భరద్వాజ - జామదగ్ని - అనుపాయలుగా చీలి సప్తగోదావరమై తూర్పు సవ చేరుచున్నది.

గోదావరి పొడవు సుమారు తొమ్మిదివందలమైళ్ళు. జలస్వీకార సుమారు 112000 చదరపుమైళ్ళు. గోదావరి పుట్టినచోట పశ్చిమ సము

సుమారు 50 మైళ్ల దూరము మాత్రమే.

గోదావరితో పాటు పేర్కొనదగిన నది కృష్ణవేణి. కృష్ణ అనగా నలుపు. నల్ల రేగడి నేలపై ప్రవహించుటచేత ఆ నదికి ఆపేరు వచ్చియుండును. కృష్ణానది జన్మస్థలము సహ్యాద్రిలోని మహాబలేశ్వరము. ఆనదికి ముఖ్యమైన ఉపనదులు తుంగభద్ర-భీమ. జలస్వీకార ప్రదేశము సుమారు 95000 చదరపు మైళ్ళు. కృష్ణా తుంగభద్ర మధ్యప్రదేశము 'రాయచూరు' - దక్షిణాపథచరిత్రలో అపర కురుక్షేత్రము. కృష్ణానది పొడువు సుమారు 800 మైళ్ళు. కృష్ణ పుట్టినచోటు నుండి పశ్చిమ సముద్రమునకు దూరము సుమారు 40 మైళ్ళు. కృష్ణా గోదావరి నదులు - పూర్వాభిముఖముగ పారి ఆంధ్రదేశమున ప్రవహించుటచేతనే ఇంతటి పెద్ద నదులు కాగలిగినవి. అవి పశ్చిమ ముఖములైనచో సెలయేరులుగ అంతరించి యుండెడివి.

తుంగభద్ర కృష్ణానదికి ఉపనదియేయైనను చారిత్రక దృష్టితో ప్రత్యేకముగ పేర్కొనదగినది తుంగ-భద్ర అను రెండు నదులు చేరి తుంగభద్ర యైనది. తుంగభద్ర దక్షిణాపథ చరిత్రలో యుగయుగాంతరములు అనేక రాజములకు సరిహద్దుగ ప్రవహించినది. బాదామి చాళుక్యులు - కల్యాణిచాళుక్యులు - రాష్ట్రకూటులు - పల్లవులు - చోళులు - గాంగులు తుంగభద్రను దాటి తమ రాజ్యమును విస్తరించుటకు చేసిన ప్రయత్నములు చరిత్రకే గగుర్పాటు గల్గించును. విద్యానగర బహమనీ రాజ్యములు-తుంగభద్ర కృష్ణ సంగమ ప్రదేశముననున్న 'రాయచూరు' - 'అంతర్వేది' కై సలిపిన పోరాటములు సుప్రసిద్ధములు. తుంగభద్రలో ప్రవహించినది నీరుమాత్రమేగాదు, వరదలై పలుమారులు వెల్లి విరిసిన పౌరుష పరాక్రమములు. మహాకవి శ్రీ జాషువాగారు శ్రీకృష్ణదేవరాయలపై వ్రాసిన పద్యము చిరస్మరణీయము.

తొల్లి నిన్ను గన్న తుంగభద్రానది
బ్రదికియున్నదిపుడు పార్థివేంద్ర!

నేటి తుంగభద్ర నిన్నెఱుంగని యట్లు
నడచుచుండె నంగనాచివోలె!!

'గంగా స్నానమ్ – తుంగాపానమ్' అన్న లోకోక్తి సుప్రసిద్ధము.

పినాకిని లేక పెన్న నందికొండలలో ఉద్భవించి, తాడిపత్రి–గండికోట నెల్లూరు ప్రాంతముల ప్రవహించి తూర్పు సంద్రమును చేరుచున్నది.

మహాభారత యుద్ధము క్రీస్తుపూర్వము 3000 సంవత్సరములనాడు జరిగినది. అందు ఆంధ్రులు కౌరవపక్షమున పోరాడిన వీరులుగా అభివర్ణితులు. మహా భారతము ప్రకారము–

"ఆంధ్రాశ్చ బహవః"

ఆంధ్రులలో పెక్కు తెగలుండెడివని తెలియుచున్నది. ఇందులో ఐత రేయ బ్రాహ్మణము పేర్కొనినవారు కొందరు మహాభారతమున పాల్గొనిన వీరులు ఉండవచ్చును.

రామాయణములోని అహల్యాశాపవిమోచనము జరిగినది ఆంధ్రదేశము నందే. గోదావరి గౌతమపుత్రిక అహల్య గౌతమ ఋషిభార్య. ఆహారధాన్యమైన వరిగింజలను ప్రపథమమున కనుగొని – వరిమొక్కలను నాటి వ్యవసాయ విద్యకు నాందీపూజ చేసినది గౌతమఋషి. అతడు గౌతమీతీరమున క్షామపీడితులైన సప్త ఋషులకు వరి పండించి అన్నదాతగ పేరుకెక్కిన సన్నివేశము ఐతిహ్యాము కమ్మనికలలు అల్లినది. అతని భార్య అహల్య. అహల్య అనగా దున్న నట్టి భూమి అని అర్థముగూడ సులభగ్రాహ్యము. శ్రీరామ పాదస్పర్శచే అహల్యా శాపవిమోచన మైనదట. సీత అనిన నాగలిచాలు. అహల్యా శాపవిమోచనానంతరము సీతా కల్యాణము ఆంధ్రదేశములో వేలకొలది రామాలయాలలో భద్రాచలములో ప్రతి సంవత్సరము సీతాకల్యాణ మహోత్సవము జరుగుచున్నది. రామపాద సాగరము నిర్మించినచో అది నిజమైన అహల్యా శాపవిమోచనము. నిజమైన నిత్యసీతా

కల్యాణ మహోత్సవము. ఆంధ్రదేశములోని నదులలోని నీరు చాలవరకు సముద్రము పాలగుచున్నది. పెన్నకు ఆనకట్టలు ఎక్కువగ కట్టినారుగాని అందులో నీరు తక్కువ.

ఆంధ్రదేశములో గోదావరీ కృష్ణా నదీజలాలను సంపూర్తిగా వినియోగించుకోకపోవుట ఆంధ్రుల దోషమేగాక యావద్ భారతభూమికే ద్రోహము. పెద్దనదులేగాక ఎన్నో వేలకొలది సెలయేరులున్నవి. డాక్టరుగా అహోరాత్రములు కష్టించి ధనార్జన చేసిన మేధావి శ్రీబెండపూడి పేర్రాజుగారు వ్యవసాయ క్షేత్రము నెలకొల్పి కొన్ని క్రొత్త ప్రయోగములుచేసి వెలిబుచ్చిన అభిప్రాయము ఎన్నదగినది. "వ్యవసాయము అనగా–నీరు"–అన్నాడాయన.

శ్రీ శొంఠి రామమూర్తిగారు–రామపాద సాగరమును గూర్చి కలలుగన్న మేధావి, ఒక సన్మానసభలో అన్నమాట చిరస్మరణీయము.

సభ ప్రారంభమైనది–ప్రార్థన జరిగినది–"మా తెలుగుతల్లికి మంగళారతులు"– అను పాటతో, కమ్మని కంఠంతో ఒక అమ్మాయి నక్షత్రాలు రాలునట్లు శ్రోతలను మంత్రముగ్ధుల గావించినది.

గలగలా గోదారి కదిలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు రాలుతాయి
.......

"తెలుగుతల్లి" – పులకించినది అనిపించినది. ఎందరో గంభీరోపన్యాసాలు చేసినారు శ్రీ శొంఠి రామమూర్తిగారు చిట్టచివరకు మాటలాడవలసిన తరుణ మాసన్నమైనది. క్రియాప్రధానుడైన ఆ మేధావి పాపము వాక్శూరుడుగాడు. ఆయన ముచ్చటగా మూడుముక్కలే చెప్పినాడు–

"గలగలా గోదారి కదలిపోతుంటేను బంగారుపంటలు పండవు
బిరబిరా కృష్ణమ్మ పరుగులెడుతుంటేను మురిపాల ముత్యాలు రాలవు

ఆ నదులలో పారే నీరుకు ఆనకట్టవేసి - రామపాద సాగరము నాగార్జున సాగరాలు నిర్మించిననే బంగారు పండుతాయి. ఇదే నేను చెప్పవలసిన మాట అందించ వలసిన సందేశము" అని మారుమాట పలుకకుండ కూర్చొనినారు.

కృష్ణా గోదావరి - రెండు జీవనదులు. మరి యెన్నో ఉపనదులు, ఏరులు సెలయేరులు ఆంధ్రదేశములో ప్రవహించుచున్నవి. ఎన్నో ఖనిజములున్నవి. పారిశ్రామికముగా అభివృద్ధికవసరమగు ముడి పదార్థములు ఎన్నో పుష్కలముగా లభించుచున్నవి. అడవులు పర్వతములు కొల్లలు సస్యశ్యామలమై ఆంధ్రదేశము అన్నపూర్ణగా మాత్రమేగాక విద్యున్నిలయముగ పారిశ్రామిక కేంద్రముగ అభివృద్ధిచెందగలదన్న మాట నిశ్చితపూర్వము. ఏప్రదేశమునకైన నిజమైన సంపద ఖనిజసంపదగాదు. సస్యసంపదగాదు. దేశీయుల తెలివితేటలే నిజమైన దేశసంపద. ఆంధ్రదేశమున ప్రజలలో తొలుకాడుచుండెడి తెలుగు వెలుగే శాశ్వతమైన ఎన్నటికీ తరగని నిజమైన దేశసంపద.

చరిత్రోదయమున ఆంధ్రరాజ్యమునుగూర్చిన ప్రస్తావన చంద్రగుప్త మౌర్యుని ఆస్థానమున గ్రీకుల రాయబారిగానున్న మెగస్తనీసు రచనలవలన తెలియనగును. ఆంధ్రులకు 100000 కాల్బలము, 1000 గజబలము, 2000 ఆశ్వికదళము గలదనియు వారి యేలుబడిక్రింద 30 దుర్గములు అనేక గ్రామములు కలవని అతడు చెప్పియున్నాడు.

ప్రాచీన బౌద్ధవాఙ్మయము మహానదికుపనదియగు 'తెలివాహ'కు దక్షిణమున ఆంధ్రరాజ్యము గలదని తేల్చినది.

'సూత్తనిపాతము'న 'అంధకరట్టము' గోదావరీ తీరప్రాంతముగ అభినుతము. క్రీ॥శ॥ 50 ప్రాంతములోని 'అలెగ్జాండ్రియా' వాస్తవ్యుడైన వణిజుడు వ్రాసిన

'పెరిప్లసు'-అను గ్రంథమునుబట్టి ఆంధ్రరాజ్యము కృష్ణా గోదావరి ముఖద్వారములనుండి పశ్చిమమునకు దూరముగవ్యాపించిన ప్రదేశముగ గుర్తింపవచ్చును. క్రీ॥శ॥ 130 ప్రాంతమువాడగు గ్రీకు భూగోళజ్ఞుడు 'టోలిమీ' ఆంధ్రరాజ్యము కృష్ణా ముఖద్వారమునుండి పశ్చిమమునకు వ్యాపించిన ప్రదేశమని చెప్పియున్నాడు. మౌర్య సామ్రాజ్యమునాటికే ఆంధ్రదేశము సుప్రసిద్ధ రాజ్యముగా పేరెన్నికగన్నది.

అశోకుని కళింగ దండయాత్ర ప్రపంచచరిత్రలో మిక్కిలి ప్రాముఖ్యము నార్జించినది. కళింగము మౌర్యసామ్రాజ్యమునకు సరిహద్దు రాజ్యము. కళింగమునకు ఆంధ్రరాజ్యము సరిహద్దురాజ్యము. కౌటిల్యుని అర్థశాస్త్రములోని అలనాటి రాజనీతి ప్రకారము సరిహద్దు రాజ్యములు శాత్రవములు. శత్రురాజ్యమునకు శత్రురాజ్యము పరమ మిత్రరాజ్యములను నీతిచొప్పున ఆంధ్రరాజ్యము మౌర్యరాజ్యమునకు పరమ మిత్రరాజ్యమని ఊహింపనగును. అశోకుడు జయించినది కళింగమే. అంతటితో అతని దక్షిణ దిగ్విజయయాత్ర పరిసమాప్తమై ధర్మ సర్వ దిగ్విజయయాత్ర ప్రారంభమైన సంగతి ప్రపంచ చరిత్రకు సువిదితము. పురాణములలో శాతవాహనులు ఆంధ్రులు - ఆంధ్రభృత్యులు - ఆంధ్ర సజాతీయులుగ అభినుతులు. దీనిని బట్టి భృత్యులైన ఆంధ్రులు మౌర్య సామ్రాజ్యమున తొలుత కొలువులోనుండి ఉత్తమ సైనికులుగ చిరానుభవము నార్జించినట్లు కొందరు చరిత్రకారులు ఊహించుచున్నారు. ఈ ఊహ సత్యమైనదని నిరూపించుటకు బలవత్తరసాక్ష్యమున్నది. ప్రాచీన తమిళకవి 'మామూలనార్' వ్రాసిన వాక్యములను భారతీయ చరిత్రకారులు ఇంతవరకు గుర్తించలేదు. అతడు మౌర్యులు దక్షిణాపథమునకు సేనలను పంపిన ఉదంతమునుగూర్చి వ్రాసెను. చంద్రగుప్తుడు తన జీవితమున అపర సంధ్యాసమయమున కర్ణాటమునందలి శ్రావణ బెల్గోలాలో జైనుడై గడిపినట్లు జనశ్రుతి. కోసరులకు సాహాయ్యముగ మౌర్యులు తమిళదేశమునకు పంపిన దండయాత్రలో సేనాగ్రభాగమున

రణకుశలులైన 'వడగరులు' తరలివచ్చిరి అని మామూలనార్ వర్ణన. తమిళ వాఙ్మయమున 'వడగరు' లనిన తెలుగువారు, ఆంధ్రులనుట వేత్తలకు సువిదితము. మౌర్య సామ్రాజ్యమున ఆంధ్రభటులుండుటచేతనే పురాణాములు ఆంధ్ర సజాతీయులను ఆంధ్ర భృత్యులుగ అభివర్ణించినవి.

అశోకుడు సింహాసనము నదిష్టించుటకు పూర్వము మౌర్యసామ్రాజ్యమున వారసత్వయుద్ధము జరిగినట్లు ఐతిహ్యము. కళింగమునకు మగధరాజ్యమునకు వైరము అశోకుడు పుట్టకముందునుండి నందరాజుల కాలములోగూడ ఉన్నట్లు జగత్ ప్రసిద్ధిగాంచిన 'ఖారవేలు'ని 'హాతిగుంఫ' శాసనము వలన తెలియనగును.

ఆంధ్ర శాతవాహన రాజులలో ప్రపథముడు శిముకుడు. శాతవాహన రాజ కాలనిర్ణయము బహుళ వివాద గ్రస్తమైనది. కాని శిముకుడు సింహాసనము అదిష్ఠించినది క్రీ॥పూ॥ 273 అనగా అశోకుడు సింహాసనమధిష్ఠించుటకు ఒక సంవత్సరము-పూర్వము. 1. మౌర్యసామ్రాజ్యము వారసత్వ యుద్ధములో చిక్కుకొనిన సమయములో ఆంధ్రరాజు శిముకుడు-సమీప రాజ్యాధిపతి ప్రాముఖ్యము వహించుట సహజము. అశోకుడు చక్రవర్తియగుటలో ఆంధ్రరాజు శిముకుడు తోడ్పడినాడు. అశోకుని శిలాశాసనములో ఆంధ్రులు సామంతుల పట్టికలోగాక మిత్రరాజుల పట్టికలో చేరుట గమనింపదగిన విశేషము. శిముకుని తమ్ముడు 18 సంవత్సరాలు పరిపాలించినాడు. అందు పదునాలుగు సంవత్సరములు అతడు అశోకునకు సమాకాలీనుడై ఆంధ్రదేశమున బౌద్ధమతము వ్యాప్తియగుటకు తోడ్పడినాడు. నాసిక గుహలలో ఒక శాసనమున అతని మహామాత్యుడు బౌద్ధభిక్షువులకై ఒక గుహను నిర్మించినట్లున్నది. ఆ గుహ కట్టినది శాతవాహనులే అయినను వాస్తురేఖలలో అశోక శిల్పప్రభావము స్వయంవ్యక్తమగుచున్నదని శ్రీ గొర్తి వెంకట్రావుగారు వ్రాసినారు.

ప్రపంచ చరిత్రలోని వింతలలో వింతగ చెప్పదగినది బౌద్ధమతము

మాతృదేశమైన భారత భూమినుండి అదృశ్యమగుట. ఒకనాడు ఆ సేతుహిమాలయము బౌద్ధమతము వర్థిల్లి ఖండ ఖండాంతరములకు చీనా, జపాను దేశములకు వ్యాపించినది. ఇప్పటికిని ప్రపంచ జనసంఖ్యలో అధికసంఖ్యాకులు బౌద్ధులే అని చెప్పుచున్నారు. భారతదేశములో అశోకునితో పాటు ఆంధ్రదేశము బౌద్ధము నాదరించినది. అమరావతి -జగ్గయ్యపేట - భట్టిప్రోలు-నాగార్జున కొండ-శాలిహుండము మున్నగు సుప్రసిద్ధ స్థలములతోపాటు యావదాంధ్రము బౌద్ధము నాదరించుటేగాక ఆంధ్రబౌద్ధము జావా, బోర్నియో, బర్మాదేశములలో గురుపీఠములధిష్ఠించినది. ఆంధ్ర బౌద్ధసంస్కృతి ఇటు సింహళమునుండి అటు చీనావరకు విస్తరిల్లినది. నాగార్జునుని గ్రంథములు చీనాభాషలోనికి పరివర్తితములైనవి.

భారత చరిత్రలోని వింతలలోని వింతగ ఎన్నదగినది బౌద్ధము ఆంధ్ర దేశమునుండి అదృశ్యమగుట. బౌద్ధము ఆంధ్రభూమినుండి అదృశ్యమైనదిగాని బుద్ధభగవానుని భూతదయాముద్ర మాత్రము ఆంధ్రుల హృదయాంతరాలలో చెరిగిపోలేదు.

యుగ యుగాంతరాలు ఆంధ్ర సంఘారామములలో వేలకువేలు బౌద్ధ భిక్షువులు

బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి

1. ఈ విషయము నాప్రాచీన దక్షిణ భారతచరిత్రలో సవిస్తరముగా కాననగును. పుట-72.

2. "The cave is Asokan in inspiration and Satavahana in execution" - Sri Gorti Venkat Rao

అను శరణత్రయ దీక్షను గైకొని తమ దినచర్యను, జీవితమును బుద్ధ భగవానుని కంకితముచేసి ధన్యులైనారు. బౌద్ధము సుమారు ఆరు శతాబ్దులు ఆంధ్రుల జీవితమును తీర్చిదిద్దినది.

"క్రొత్తదనమును కనలేక కుమిలి క్రుంగి
ప్రసవవేదన పడుచుండె ప్రాతదనము"

అనునది ప్రపంచ చరిత్రయొక్క సారముగ నెన్నదగును.

ఆంధ్రులు-చరిత్రలో ఎల్లపుడు క్రొత్తదనమును ఆరాధించినారు.

భారతభూమిలో భిన్నరంగాలలో తొలి ఉషస్సులు పొడగట్టు ప్రదేశము తెలుగునేల. కాలదోషముపట్టిన ప్రాతదనమునకు స్వస్తిచెప్పి జగద్ధితమైన క్రొత్తదనమును సద్యఃస్ఫూర్తితో ఆరాధించు ప్రకృతి ఆంధ్రుల జన్మహక్కు. భారతదేశమున ప్రపథమమున మేలుకొనుట ఆంధ్రుల నైసర్గిక లక్షణము. అందుచే జగద్ధితమైన ఏ నూతనోద్యమమైనను ఆంధ్రుల ఆదరాభిమానములను చూరగొనగలుగుచున్నది. అది స్థూలదృష్టికి అధికార ధిక్కారనముగ విప్లవ వాద స్వభావముగ కనిపించుట సహజము.

"తెలుగు మీరుట"-అను పదగుంఫనములోని స్వారస్యము అనుభవ పునరుక్తము భారతదేశమున ఆంధ్రుల చరిత్రకు ఒక విశిష్టత ఉన్నది. చరిత్రోదయమునుండి ఆంధ్రులు స్వతంత్రముగా కన్పించుచున్నారు. అశోకునినాడు ఆంధ్రులు మౌర్యసామంతులుగారు. ఆంధ్ర శాతవాహనవంశ స్థాపకుడగు శిముకుడు అశోకునకు సమకాలీనుడు. అశోకుడు సింహాసన మధిష్ఠించుటకు తోడ్పడినవాడు. ఆంధ్రుల పరాక్రమ ప్రాభవములు ప్రాగశోకములు. అశోకుని కాలమున ఆంధ్రుల ప్రాభవము ఇనుమడించినది. కాలక్రమమున ఆంధ్ర శాతవాహనులు పాటలీపుత్రమును జయించి ఉజ్జయినిని ఆక్రమించినారు. అశోకునినుండి క్రీ॥పూ॥ మూడవ శతాబ్దినుండి క్రీ॥శ 1323 పదునాలుగవ

శతాబ్ది ప్రథమపాదము వరకు ఆంధ్రులు స్వాతంత్ర్యమును అనుభవించియున్నారు. తొలుత శాతవాహన సామ్రాజ్యాధినేతలుగా దక్షిణాపథమునంతటిని ఏలుకొనుటయేగాక ఉత్తర భారతము నాక్రమించి విదేశియులైన శక, పహ్లావ, యవన, మ్లేచ్ఛ చమూ సమూహముల నిర్జించిన జగదేకవీరులుగా ప్రసిద్ధికెక్కినారు తరువాత ఇక్ష్వాకులు - పల్లవులు - శాలంకాయనులు - విష్ణుకుండినులు చాళుక్య కాకతీతయ యుగములలో సర్వతంత్ర స్వతంత్ర రాజ్యపౌరులుగా ఉన్నారు. యుగ యుగాంతరాలు స్వరాజ్యము స్వాతంత్ర్యముననుభవించినవారు. తెలుగు వెలుగు - ఆంధ్రులకు సహజసిద్ధమైన వర్చస్సు ప్రసాదించుచున్నది.

క్రీ॥శ॥ 1323లో ఓరుగల్లు పతనముతో కాకతీయసామ్రాజ్యము అంతరించినదిగాని, ఆంధ్రభూమిలో తిరిగి ఆరిపోని స్వాతంత్ర్యజ్యోతి రగుల్కొనినది. నాలుగైదు సంవత్సరాలలో ఎఱ్ఱాప్రెగ్గడ మహాకవికి మిత్రుడు - రెడ్డి ప్రభువు ప్రోలయ వేమారెడ్డి తమ్ముడైన మల్లారెడ్డి ప్రభృతులు స్వాతంత్ర్యముకై స్వరాజ్యముకై బ్రహ్మాండమైన మహెూద్యమ ప్రవర్తకులైనారు. ఎఱ్ఱాప్రెగ్గడకు పశ్చిమాంధ్రమున సమకాలీనుడు విద్యారణ్యమహర్షి. అచ్చట ఒక మహాసామ్రాజ్యమును హరిహర బుక్కరాయలు-విద్యారణ్య మహర్షి ఆశీస్సులతో ఆవిష్కరించినారు. అదే విద్యానగర సామ్రాజ్యము విజయనగర సామ్రాజ్యము. విజయనగర సామ్రాజ్యములో ఆంధ్రులు నిర్వహించిన భూమిక విఖ్యాతము.

# భారతదేశ చరిత్రలో ఆంధ్రులు నిర్వహించిన భూమిక

భారతదేశ చరిత్రకు సుపరిచితమైన ప్రథమ విదేశ దండయాత్ర అలెగ్జాండర్ చక్రవర్తి నాయకత్వమున వచ్చినదే. అది కేవలము గ్రీకు దండయాత్రకాదు. అసలు గ్రీకులు భారతభూమిపై దండయాత్రకు సుముఖులుగారని చరిత్ర కథనము. విశ్వవిజేత కావలెనన్న కోరికచే అలెగ్జాండరు ఆరంభించిన దండయాత్ర అది. అలెగ్జాండరు భారతీయుల పరాక్రమ ప్రాభవములకు సంస్కృతికి జేజేలు పలికి తాను జయించిన పురుషోత్తముని మెచ్చుకొని రాజ్యము వీరభృతిగా ఇచ్చినట్లు పులకాంకుర ప్రకరములతో చరిత్రకారులు వర్ణించియున్నారు. గ్రీకు చరిత్రకారులుకూడ భారతీయవీరులను ప్రశంసించియున్నారు. గ్రీకుల దండయాత్ర వలన అలెగ్జాండరుకు విజయముసిద్ధించినది గాని దానివలన భారతీయులకు వచ్చిన నష్టమంతగా లేదు. ఆ నాటి భారతీయ సంస్కృతి గాని, భారతీయ శౌర్యము గాని గ్రీకులకు దాసోహ మనలేదు. అలెగ్జాండరు తరువాతి కథ చంద్రగుప్త మౌర్యుడు గ్రీకులను జయించి గ్రీకు రాజకన్యను వివాహమాడినాడు. గ్రీకు రాయబారి మెగస్తనీసు చంద్రగుప్తుని యాస్థానమునకు విచ్చేసినాడు. ఆ రాయభారి భారతీయ సంస్కృతిని గూర్చి భారతీయులను గూర్చి వ్రాసిన అంశములు దిగ్భ్రాంతిని గల్గించి ఆనాడు భారతదేశము యావత్ ప్రపంచములో అగ్రస్థానము వహించిన సంగతిని రుజువు చేయుచున్నది. అశోకుని కాలమున జరిగిన కళింగ యుద్ధము మౌర్యసామ్రాజ్య రాజనీతిలో మార్పు తెచ్చినది. అశోకుడు ధర్మ సామ్రాజ్యమునకు సార్వభౌముడుగా మారిపోయినాడు. బౌద్ధమతము రాజమతమైనది. బౌద్ధమతావలంబియయ్యు సనాతన భారత సంస్కృతిని అశోకుడు అవరోధింపలేదు. అశోకుని నిరతిశయాభిమానమువలన బౌద్ధము దేశదేశాల వ్యాపించినది. అతని యశోలతలు దిగంతముల పుష్పించినవి. కాని–బౌద్ధము భారతీయుల పౌరుషాగ్నిని

ఒక విధముగ చర్లార్చినదేమో! ఫలితముగా విదేశీయులు విజృంభించినారు. ఇట్టివారే గ్రీకులు - యవనులు - శకులు - పహ్లవులు....

తర్వాత రాజ్యమేలిన చక్రవర్తులు బౌద్ధమతానుయాయులగుటచే విదేశీయుల విజృంభణమును అరికట్టలేకపోయి యుందురు. క్రీ॥పూ॥ రెండువందల నుండి డెమిట్రియస్- అపొల్లుడొటస్ - మీనాండర్ భారత భూభాగమున అనేక విజయములు సాధించి యువనరాజ్య సంస్థాపకులైరి. గర్గసంహితయందలి యుగపురాణమున అతిలోలుపులైన శకులు సాకేతమును ముట్టడించినట్లు గలదు. పతంజలి అద్యతనభూతమున కుదాహరణముగా యవనులు 'సాకేతమును ముట్టడించుచుండిరి' అని వ్రాసిన వాక్యమును చదువరులు, గరుదేరక అనుశీలించుట అసాధ్యము.

క్రీ.పూ. 236 అశోక చక్రవర్తి మరణము

కుణాలుడు సింహాసన మధిష్ఠించుట

228 దశరథుడు

220 సంప్రతి

211 సాలీశుకుడు

195 బృహద్రథుడు

బృహద్రథుని నాటికే యవనుల విజృంభణము పరాకాష్ఠ నందినది.

యవనుల బారినుండి భారతదేశమును సంరక్షించి స్వరాజ్యమును స్వాతంత్ర్యమును సనాతన సంస్కృతిని కాపాడగల వీరునికై దేశము ఎదురుచూచినది చక్రవర్తి బృహద్రథుడు ఆ కర్తవ్యమును నిర్వహింపలేడని తేలిపోయినది. శంకా సంకుచితాంతరంగుడైన బృహద్రథుడు సేనా సమీక్షకై వచ్చినపుడు సేనాపతి పుష్యమిత్రశంగుడు అతనిని వధించి యవనులతో పోరాడి పాటలీపుత్రమును రక్షించినాడు. ఇది క్రీ.పూ. 185 నాటి సంగతి. రాజహంతయైన పుష్యమిత్రుని

దేశోద్ధారకుడైన ధీరోదాత్తునిగ ప్రజలు ప్రశంసించినారు. అది భారతీయచరిత్రలో పేర్కొనదగిన సంక్లిష్ట విపత్కాలము. ఆవిపత్కాలములో దేశమును సంరక్షించిన వీరాధివీరుడు పుష్యమిత్రుడు. పుష్యమిత్రుడు తాను దేశరక్షకుడే కాని రాజద్రోహి కానని నిరూపించుకొనుటకై అతడు రాజ్యమేలెనుగాని సింహాసన మధిష్టించలేదు. బ్రతికియున్నంతకాలము అతడు సేనాధిపతిగానేయుండిపోయినాడు. అతని కుమారుడు అగ్ని మిత్రుడు రాజ నాముడు ఈ విషయము కాళిదాస రచితమగు మాళవికాగ్నిమిత్ర నాటకమున హృదయంగమముగా నభివ్యక్తమగుచున్నది.

పుష్యమిత్రునకు సమకాలీనుడు శాతకర్ణి. ఇతడు శాతవాహన చక్రవర్తి ఇతడును పుష్యమిత్రుడును సనాతన మతమును పునరుద్ధరించి- వేదవిహితములయిన యజ్ఞయాగాదులను తిరిగి ప్రారంభించినట్లు హరివంశ కథనము. పుష్య మిత్రుడు రెండు అశ్వమేధయాగములను చేసినాడు. అట్లే శాతకర్ణియ రెండు అశ్వమేధయాగములను చేసినాడు. 'ఖారవేలుని హాతిగుంఫ' శాసనము ననుసరించి ఆనాడు యావద్భారత దేశసార్వభౌమత్వమునకై ప్రయత్నించినవారు--

i. యవనరాజు దిమిత్రుడు (డెమిట్రియస్)
ii. కళింగ చక్రవర్తి ఖారవేలుడు
iii. మగధసేనాధిపతి పుష్యమిత్రశుంగుడు
iv. ఆంధ్ర శాతవాహన సమ్రాట్టు 'మహాన్' శతకర్ణి.

క్రీ॥పూ॥ 175 సంవత్సరమున యవనరాజు డెమిట్రియస్ మధురను ముట్టడించినట్లు ఖారవేలుని హాతిగుంఫ శాసనము. ఖారవేలుడు డెమిట్రియసును పారద్రోలినట్లు, పశ్చిమాధిపతియైన శతకర్ణిని సరకు చేయలేదని చెప్పుకున్నాడు.

క్రీ॥పూ. 177 ఖారవేలుని రాజసూయము

క్రీ॥పూ. 175 పుష్యమిత్రుని ప్రథమాశ్వమేధయాగము

క్రీ॥పూ. 171 లో పుష్యమిత్రుని జయించినట్లు ఖారవేలుని కథనము.

ఖారవేలుని మరణానంతరము పుష్యమిత్రశుంగుడు ద్వితీయాశ్వమేధ యాగమును చేసి ఉత్తర భారతమునకు చక్రవర్తి యయ్యెను. అట్లే ద్వితీయాశ్వ మేధయాగము చేసి శాతవాహన శాతకర్ణి దక్షిణాపథ సార్వభౌముడయ్యెను.

పుష్యమిత్రునకు సంక్రమించినది పాటలీపుత్ర రాజ్యమేగాని మగధ సామ్రాజ్యముగాదు. శతకర్ణి 50 సంవత్సరములు పరిపాలించినాడు. అతడు పశ్చిమ మాళవరాజ్యమును జయించినట్లు అతని నాణెములవలన తెలియుచున్నదని కన్నింగుహాముగారి అభిప్రాయము. ఉజ్జయిని రాజధానియైన అవంతి, భిల్సారాజదానియైన ఆకరరాజ్యములు సుంగులకు వారి తర్వాత పాలించిన కణ్వులకు లోబడియుండలేదు. అచ్చట లభించిన నాణెములపై 'రానోసిరిసాతిస' అను అక్షరములయొక్కయు, నానాఘాట్ శిలాప్రతిమల క్రిందనున్న అక్షరముల యొక్కయు సామ్యమునుబట్టి రెండవ శతకర్ణి ఆదేశముల జయించినట్లు కన్నింగుహాము ప్రతిపాదించెను. ఉజ్జయిని రాజ్యము, శుంగులమధ్య – శకులమధ్య – శాతవాహనుల మధ్య చాలాసారులు చేతులు మారినది.

సనాతన సంస్కృతి పునరుద్ధరణకు దక్షిణాపథమున కంకణముగట్టుకొని నిలిచి యవనులను పారద్రోలిన ఘనత ఆంధ్ర శాతవాహనులకు దక్కినది.

ఉజ్జయినీ రాజ్యమును శకులు శాతవాహనులనుండి – రెండవ శాతకర్ణి తరువాత – జయించి ఆక్రమించినారు. డెమెట్రియస్ కూతురు ఆగతోక్లియ –మీనాండరు భార్య – బాలుడైన పుత్రునిపక్షమున రాజ్యమేలినది. డెమిట్రియస్ ప్రత్యర్థి యూక్రడీటీసు పుత్రుడైన హిలియోకిల్సు – భారతదేశముపై దండెత్తినాడు. అది మీనాండరు రాజ్యవిచ్ఛిత్తికే దారితీసినది. హెలియోకీల్సుపుత్రుడు క్రీ॥పూ॥ 130 ప్రాంతమున రాజయ్యెను. మగధలో అతని రాయబారి 'హెలియోడరసు'. ఇంతలో పర్షియాదేశమునందలి శకులు భారతదేశముపై దండెత్తిరి. క్రీ॥పూ॥

70 నాటికి వారు 'మౌలెస్' నాయకత్వమున జీలము ప్రాంతమును జయించి తక్షశిలనాక్రమించిరి. మౌలెస్ రాజ్యమునకు 'అజస్' చక్రవర్తి వారసుడయ్యెను. అతడు మధురవరకు జయించి క్రీ॥పూ॥ 58లో విక్రమాదిత్య శకము నారంభించినాడు. అతని సామ్రాజ్యము 'యూఫ్రిటౌసు' నుండి యమునవరకు విస్తరించినది. క్రీ॥పూ॥ 73లో శుంగవంశము అంతరించినది అజసుని విజృంభణ అరికట్టు వారు ఉత్తర భారతమున లేకపోయినారు. అపుడు – ఉజ్జయినీ చక్రవర్తియై విక్రమాదిత్య బిరుదాంకితుడైన విదేశప్రభువు అజసుతో పోరి స్వరాజ్యము, స్వాతంత్ర్యము సనాతన సంస్కృతినిలుపు భారము ఆంధ్రశాతవాహన చక్రవర్తులపై పడినది. శాతవాహన చక్రవర్తి మహేంద్రస్వాతి మరణము క్రీ॥పూ॥ 58 – 57. అపుడే విక్రమాదిత్య శక సంస్థాపనము గమనింపదగిన విషయము. మహేంద్రస్వాతి – ఉజ్జయిని విక్రమాదిత్యునితో పోరాడి వీరమరణమునొందెనా? అతని పుత్రుడు కుంతల శాతకర్ణి క్రీ॥పూ॥ 54-46 సంవత్సరముల మధ్య ఉజ్జయినీచక్రవర్తి విక్రమాదిత్యుని జయించి ఆ విజయోత్సాహముతో దక్షిణముననున్న కుంతలమును గూడ జయించి ఆంధ్రశాతవాహన సామ్రాజ్యమును ఉత్తరపు–దక్షిణపు సరిహద్దులను విస్తరింపగల్గెను.

కుంతల శతకర్ణి, ఉజ్జయినీప్రభువైన అజస విక్రమాదిత్యుని జయించి తాను ఉజ్జయినికి అధీశ్వరుడై విక్రమాదిత్య బిరుదమునుగూడ స్వీకరించెను. (జయించిన రాజుల రాజ్యములతోపాటు వారి బిరుదములుగూడ విజేతలు స్వీకరించుట సుప్రసిద్ధమైన సంప్రదాయము)

యావద్ భారతదేశమునందు ప్రచారములోనున్న ఐతిహ్యము ప్రకారము విక్రమాదిత్యుని సంహరించినది శాతవాహనరాజే.

సనాతన సంస్కృతిని పునరుద్ధరించి స్వరాజ్యము స్వాతంత్ర్యము కాపాడుటకై దీక్షవహించిన పుష్యమిత్ర శుంగుని వంశము అంతరించి, ఉత్తరభారతము

యవనాక్రాంతమైనపుడు అజనుని సంహరించిన అద్భుతవృత్తాంతమునకు భారతదేశ చరిత్రలో రావలసినంత ప్రాముఖ్యము రాలేదు. ఉత్తర భారతదేశమునుండి సనాతనసంస్కృతి వెడలివచ్చి ఆంధ్ర శాతవాహనుల శరణువేడి ఆంధ్రదేశమునకు తరలివచ్చి అభ్యుదయపరంపరాభివృద్ధి గాంచిన సంగతి ఆంధ్రుల హృదయాంతరాళముల పులకింపజేయు సన్నివేశము.

క్రీ॥పూ॥ 57 సంవత్సరము భారతదేశ చరిత్రలో విశిష్ట ప్రాముఖ్యము గలది. అది విక్రమ శకారంభము. విక్రమాదిత్యుని శకారియైన శాతవాహనుడు జయించెనని ఐతిహ్యము వేయి గొంతుకలతో చాటుచున్న విషయమే. ఆ శకారి శాతవాహనుడెవ్వరు? అతడు కుంతల శాతకర్ణియని నిరూపించవచ్చును.

వాత్స్యాయన కామసూత్రములలో కుంతల శాతకర్ణి భార్య మలయవతియనియున్నది. కథా సరిత్సాగరములో విక్రమాదిత్యుని భార్య మలయవతి. సాతవాహనుల ఆస్థానపండితుడైన గుణాఢ్యుని బృహత్కథ కథాసరిత్సాగరమునకు మాతృక. అందు విక్రమాదిత్యుని తండ్రి మహేంద్రాదిత్యుడు, మత్స్యపురాణ పట్టికలో కుంతల శాతకర్ణి తండ్రి మహేంద్రస్వాతి. అందుచే శకారియైన కుంతల శాతకర్ణి ఉజ్జయినీ విక్రమాదిత్యుని జయించి అతని రాజ్యముతో పాటు విక్రమాదిత్య బిరుదము దాల్చినట్లు సుస్పష్టము.

కాళిదాస మహాకవి విక్రమాదిత్యుని ఆస్థానకవియనుట సర్వజగత్ప్రసిద్ధము. ఆ కవికి ఉజ్జయినికిగల అనుబంధమును జనశ్రుతి యుగ యుగాంతరములుగా ఉద్ఘోషించుచుండుట అటుండగా మాళవికాగ్ని మిత్రమును, మేఘసందేశమును పరిశీలించిన సహృదయులకు అది సువ్యక్తము అయినచో కాళిదాస మహాకవికి ఆశ్రయ ప్రదాతయైన విక్రమాదిత్యుడెవరు?

కాళిదాసు ఉజ్జయినివాడైనను అతడు దక్షిణాపథమునందు కొంతకాలము వసించినాడని చెప్పకతప్పదు. కాళిదాస మహాకవి రచించిన మేఘసందేశము

విశ్వ విఖ్యాతకావ్యము. అందు కాళిదాస కల్పితుడగు మేఘుడు, జంగమ ప్రణయ లేఖావతారమెత్తి ప్రేమసందేశ హరుడై బయలుదేరినది దక్షిణాపథమునుండియే యనునది నిర్వివాదాంశము మేఘుడు బయలుదేరినది రామగిరి.

మేఘుడు దాటిన నది నర్మద. పర్వతములు వింధ్యాపంక్తులు. దాటని నదులు గోదావరి - కృష్ణలు కావున గోదావరి తీరమునందలి రామగిరినుండియే కాళిదాసుమేఘుడు బయలుదేరినట్లు ఎంచనగును. అచ్చటే జనకతనయా స్నానపుణ్యోదకములు నేటికీ ఉన్నవి.కాళిదాసు రచించిన విక్రమోర్వశీయము పౌరాణికగాథయేమైనను, అందు విక్రముని రాజధాని ఉజ్జయినికాదు. ప్రతిష్ఠానమే శాతవాహనుల రాజధాని - ప్రతిష్ఠానమనుట చరిత్రప్రసిద్దము. కావున ప్రతిష్ఠానపుర వరాధీశ్వరుడై విక్రమాదిత్య బిరుదాంకితుడైన కుంతల శాతకర్ణి. ఉజ్జయినిని జయించి-కాళిదాస మహాకవిని ఆంధ్ర శాతవాహన సామ్రాజ్య రాజధాని ప్రతిష్ఠానమునకు ఆహ్వానించి ఆస్థానకవిగా సంభావించినట్లు తేలుచున్నది. అంతే గాక కాళిదాసు రచించిన వేరొకగ్రంథము "కుంతలేశ్వర దౌత్యము" పరిశోధములో బయల్పడినది. అందు కుంతలేశ్వరుడు సార్వభౌముడు విగ్రమాదిత్యుడుసామంతుడు ఉజ్జయినీ రాజ్యము కాళిదాసు నాడు ఆంధ్ర సామ్రాజ్యమునకు సామంతరాజ్యము.

ఉత్తర భారతమునుండి ఉజ్జయినినుండి ప్రవాసిగా ఆంధ్ర శాతవాహన సామ్రాజ్య రాజధానికి తరలివచ్చినది కాళిదాసమహాకవిమాత్రమేగాదు. యథార్థముగా వచ్చినది సనాతన భారతీయసంస్కృతియే. ఉత్తరాపథము విదేశీయులకు పాదాక్రాంతమైనపుడు చరిత్రలో భారతీయ సంస్కృతికి ఆశ్రయమిచ్చి అభివృద్ధిగల్గించినది ఆంధ్రరాజ్యమే.

సనాతన భారతీయసంస్కృతి తిరిగి పుష్పించినది. పుష్యమిత్రశుంగుని పాటలీపుత్రములో వికసించిన పుష్పము శకుల ఉజ్జయినిలో వాడిపోయి ఆంధ్ర శాతవాహనుల ప్రతిష్ఠానములో ఫలప్రదమైనది. కాళిదాసమహాకవి - మేఘసందేశమును - విక్రమోర్వశీయమును రఘువంశమును - అభిజ్ఞాన

శాకుంతలమును ఆంధ్ర శాతవాహన చక్రవర్తి కుంతల శాతకర్ణి విక్రమాదిత్యుని ఆస్థానకవియై రచించుట ఆంధ్రులకందరకు గర్వకారణము. ఉజ్జయిని సంస్కృతవిద్యకు ప్రసిద్ధిగాంచినది. శకుల విజృంభణకు పలుమారులు తట్టుకొనవలసివచ్చినది. భారతదేశమున పశ్చిమమున గడిసీమగానున్న ఉజ్జయినీరాజ్యమును పుష్యమిత్రుని కుమారుడగు అగ్నిమిత్రుడు యువరాజుగ పరిపాలించెను. మౌర్యుల కాలమునగూడ రాజపుత్రులు ఉజ్జయినీ పరిపాలకులు. ఉజ్జయినికి భౌగోళికముగా ఉన్న ప్రాధాన్యము సుగమము. ఆంధ్ర శాతవాహనుల నాణెములపై కన్పించు ఉజ్జయినీ చిహ్నామునుబట్టి, శాతవాహనులు ఉజ్జయినీ విజయమునకెట్టి ప్రాధాన్యమునొసంగినది తేటతెల్లమగుచున్నది.

బృహత్కథారచనకు ప్రేరకముగా పేర్కొనబడుచున్న కథ యిక్కడ స్మర్తవ్యము. కుంతల శాతకర్ణి పట్టపురాణి సంస్కృత విదుషీమణియట! "మోదకైస్తాడయ" అని యామె పల్కిన వాక్యము రాజునకర్థముకాలేదట! జల క్రీడల సమయమున, నీటితో కొట్టవద్దన్నది రాణి! రాజుగారు మోదకములను తెప్పించి అపహాస్యమునకు పాత్రుడైనాడట!

ఆ వాక్యమును మోదకైః+తాడయ అని విరిచినచో మోదకములతో కొట్టుము అని అర్థము. సవ్యముగా - సంస్కృతసంధి విడదీయుట నెరుగని రాజునకు పరిహాసమే యెదురైనది.

రాణిగారికోసమైనా సంస్కృత మభ్యసింపవలెనని పట్టుదల కల్గినది శాతకర్ణికి. మంత్రి శర్వవర్మ - కాతంత్ర వ్యాకరణమును వ్రాసి రాజును ఆరునెలలలో సంస్కృతి విద్వాంసుని జేసెనట. సంస్కృతము నేర్చుటకు పండ్రెండేండ్ల వ్యవధికోరిన గుణాఢ్యుడు ఓడిపోయి తన ప్రతిజ్ఞానుసారము భాషాత్రయమునను రచనచేయుట మాని పైశాచీభాషలో బృహత్కథను వ్రాసెనట!

ఇచ్చట 'భాషాత్రయము' అను ప్రయోగము అరయదగినది. ఆ మూడు భాషలేవి?

అవి i. సంస్కృతము ii. ప్రాకృతము iii. దేశభాష

గుణాఢ్యునినాడును - శాతవాహన చక్రవర్తుల కాలములో సంస్కృత ప్రాకృతములతో పాటు మూడవభాష "దేశభాష" ఉన్నదన్నమాట మరువరాదు. ఆదేశభాష ఇప్పటి తెలుగు - కన్నడము - తమిళము - మళయాలము మున్నగు భాషలకు మాతృకయౌ ద్రవిడభాష. దానిని భాషావేత్తలు 'మూల ద్రావిడ భాష', అని నేడు పేరిడినారు.

శాతవాహన కాలములో కావ్యభాషగ సంస్కృతము, రాజకీయభాషగనున్న ప్రాకృతము విలసిల్లుచుండగ, దేశభాషకూడ ప్రాథమిక దశలోనున్నదన్న మాట విస్మరింపరాదు.

మగధసామ్రాజ్యము అంతరించినపిమ్మట - పాటలీపుత్రమును ఏలినది కాణ్వాయనులు. మగధలో వసుదేవుని కూలద్రోసి దేవభూతి ఆక్రమించినది సింహాసనముగాని సామ్రాజ్యముకాదు. కుంతల శాతకర్ణి శకుల విజృంభణ అరికట్టి ఉజ్జయిని జయించినాడు. ఇక ఆంధ్రులు జయించవలసినది మగధ, పాటలీ పుత్రము. కుంతల శాతకర్ణి తరువాత స్వాతికర్ణి రాజ్యమేలినది ఒక సంవత్సరమని మత్స్యపురాణము. ఈతడు విఫలప్రయత్నుడై వీరమరణము చెందెను. అతని తరువాత పులోమావి క్రీ॥పూ 45 సంవత్సరమున సింహాసనమధిష్ఠించెను అతడు కుంతల శాతకర్ణి సువిశాల రాజ్యమునకు వారసుడు. పులోమావి రాజ్యమునకు వచ్చిన ఏడు సంవత్సరములకు కాణ్వాయన సుశర్మ క్రీ॥పూ 38 ప్రాంతమున మగధ సింహాసన మధిష్ఠించినాడు.

క్రీ॥పూ 28లో పులోమావి కాణ్వాయన సుశర్మను యుద్ధములో సంహరించి మగధనాక్రమించి పాటలీపుత్రమునందలి సుగాంగేయ సౌధములలో వీరపట్టాభిషేకము నొందెను. ఆంధ్రులకు పర్యాయపదముగ 'పౌలోములు' అను శబ్దము తరచు పురాణములు ప్రయోగించుటచే పులోమావి సాధించిన ఘన

విజయమునకు ఎంత ప్రాముఖ్యము అలనాటినుండి ఏర్పడినదో గ్రహింపవచ్చును.

ఆనాడు ఆంధ్ర సామ్రాజ్యము ఆసేతుహిమాలయము వ్యాప్తి చెందినది.

కాని ఉజ్జయిని తిరిగి శకాక్రాంతమైనది. పులోమావి తర్వాత రాజ్యమేలిన గౌరికృష్ణుని పురాణములు తిట్టిపోసినవి. అతని 'నికృష్టకర్ముడ'ని 'అనిష్టకర్ముడని' వర్ణించినవి. ఆకాలమున నహపాణుడను శకుడు విజృంభించి మాళవభరుకచ్ఛ ప్రదేశముల పెద్ద రాజ్యము విస్తరింపజేసెను.

గౌరికృష్ణునిపిమ్మట రాజ్యమేలినది శాతవాహన చక్రవర్తిహాలుడు. ఇతడు సాహిత్యప్రియుడు. ఇతడే "గాథాసప్తశతి" సంతరించిన మహాకవి.

గాథా సప్తశతి - ఏడునూర్ల రసవత్తర గాథలతోనిండిన ముక్తకసంపుటి. ప్రాకృత కవిత్వమునకీ కృతమకుటాయమానము. విశ్వసాహితీ జగత్తులో నిరతిశయ కవితా ప్రాగల్భ్యమునకు "ధ్వని" ప్రధానమైన ఉత్తమోత్తమ కవితకు ఉజ్వలోదాహరణము హాలుని తరువాత సామ్రాజ్య గౌరవమును ఇనుమడింపజేసిన చక్రవర్తి గౌతమీపుత్ర శాతకర్ణి. క్రీ॥శ 60 సం॥న సింహాసనమధిష్ఠించినాడు. గౌతమీ బాలశ్రీ శిలాశాసనము నాసికలో పులోమావి (గౌతమీపుత్ర శతకర్ణి కొడుకు) 11వ రాజ్యసంవత్సరమునాటిది గలదు. బాదరాయణ బౌద్ధ బిక్షువుల కొరకు ఆ గుహనిర్మితము.

అందు గౌతమీపుత్ర శతకర్ణి అనేక రాజులను శాసించిన చక్రవర్తిగ ప్రశంసనందినాడు. అతడు అసిక - అశ్మక - మూలక - సురాష్ట - కుకుర - అపరాంత - అనూప - విదర్భ - అకారావంతి దేశములకు ప్రభువు. వింధ్యవత్ పారియాత్ర సహ్య కృష్ణగిరి - మలయ - మహేంద్ర - శేష్ఠగిరి - చకోరపర్వతములకు అధినాథుడు అతని పాదములను సామంతులు పూజించిరి. అతని వాహనములు త్రిసముద్ర జలముల గ్రుంకులాడినవి. శరణన్న వారిని రక్షించి ప్రజలసౌఖ్యమే తన సౌఖ్యముగా పరిపాలించినాడు. ఏకబ్రాహ్మణుడు.

అతని పరాక్రమ కృత్యములు రామకేశవ అర్జున భీమాదులతో తులతూగినవి.

అతడు పురుషార్థములకన్నిటికి సమాన ప్రతిపత్తి నిచ్చి రక్షించినాడు సినహుష -జనమేజయ సగర - యయాతి - రామ - అంబరీషాదులతో తుల్యుడతడు. క్షత్రియుల గర్వమడచినాడు. శకులను యవనులను పహ్లవులను నాశనముచే నాడు క్షహరాట వంశమును నిరవశేషముగా నిర్మూలించి శాతవాహన కులకీర్తి వర్ధనుడైనాడు.

కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలములో గౌతమిపాత్రగలదు గౌతమియనిన పరివ్రాజకాశ్రమమును స్వీకరించిన సన్యాసిని. గౌతమీపుత్ర శాతకర్ణి 18వ రాజ్యసంవత్సరమున వైజయంతిలో సేనావిజయోత్సవ భవనమునుండి గోవర్ధనాహారమున అమాత్యుడగు విష్ణుపాలితునకు శాసనము పంపినట్లున్నది. త్రిరాశ్మ గుహలలో నివసించుచున్న భిక్షులకు వృషభదత్తుని ఆధీనములో నంతవరకున్న ఒక గ్రామమును ఇచ్చుటకు ఆ శాసనము ఆజ్ఞాపించుచున్నది. దీనిని బట్టి వృషభదత్తుని ఆధీన ప్రదేశములు గౌతమీపుత్రునకు సంక్రమించెనని తేలుచున్నది. వృషభదత్తుడు సహపాణుని యల్లుడు. దీనిని బట్టి గౌతమీపుత్ర శాతకర్ణికి శకులపై విజయము అతని 18వ రాజ్య సంవత్సరము సిద్ధించెనని ఎంచవచ్చును.

సహపాణుని నాణెములు 13270 జోగల్ తంబిలో దొరికినవి. అందులో 9270 నాణెములను గౌతమీపుత్ర శాతకర్ణి పునర్ముద్రణ వేయించినాడు. కావున సహపాణుని గౌతమీపుత్ర శతకర్ణి జయించినట్లు కొందరు చరిత్రకారులు భావించినారు. పురాణములలో సహపాణుడు రాజ్యమేలినట్లున్నది. గౌతమీపుత్ర శతకర్ణి క్షహరాట వంశ నిరవశేషకరుడని శాసనసాక్ష్యము. కాని సహపాణాంతకుడని లేదు. నిపుణులు గౌతమీపుత్ర శతకర్ణి తిరిగి అచ్చువేయించిన నాణెములు అంతకు ముందు తర్వాత గూడ చెలామణిలోనున్నట్లు అభిప్రాయపడుచున్నారు. టోలిమీ సహపాణుని రాజ్యమును పేర్కొనెను గాని

సహపాఋనిగాదు. కావున క్షహరాట వంశమును నిరవశేషముగ నిర్మూలించి ఏకైకసార్వభౌముడై ఉజ్జయిని జయించి ఆంధ్ర సామ్రాజ్యమునేలిన గౌతమీపుత్ర శతకర్ణి 18వ సంవత్సరమున విజయమును సాధించి శాలివాహన శకము ప్రారంభించినాడు. శాతవాహన కాలనిర్ణయమునకిది ధ్వజస్తంభము.

గౌతమీపుత్ర శాతకర్ణి 18వ రాజ్యసంవత్సరము= శాలివాహనశకము కాబట్టి గౌతమీపుత్ర శతకర్ణి క్రీ॥శ॥ 60 సంవత్సరములలో సింహాసనమధిష్ఠించినాడని గణితము. ఆ గణితము ప్రకారము మత్స్యపురాణములోని ఆంధ్రరాజుల పట్టికను కాలనిర్ణయము నేర్పరచవచ్చును. తొలిరాజు శిముఖుడు. క్రీ॥పూ॥ 271 సంవత్సరమున రాజ్యపాలన ప్రారంభించినాడు. శాతవాహనులలో చివరిరాజు పులోమావి క్రీ॥శ॥ 175 వరకు పరిపాలించినాడు.

ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యము సుమారు అయిదు శతాబ్దులు జగజ్జేగీయమానముగా వెలిగినది. ఒకనాడు ఆంధ్రులు మగధనుకూడ జయించినారు. చిరకాలము ఉజ్జయినిని ఏలినారు. కుంతలముతో పాటు దక్షిణాపథమునంతటిని త్రిసముద్రాధిపతులై ఏలినారు. శాతవాహనుల రాజధాని ప్రతిష్ఠానము, అన్నమాట జగత్ప్రసిద్ధము.

చిరకాలము అమరావతి లేక ధాన్యకటకము ఆంధ్ర శాతవాహన రాజధానిగ కన్పించుచున్నది. తొలుత ధాన్యకటకము రాజధానిగ శాతవాహనులు రాజ్యముచేసి, పిదప రాజ్య విస్తరణానంతరము కేంద్రస్థలమైన ప్రతిష్ఠానమును రాజదానిని చేసుకొని – తిరిగి చివరి రోజులలో సామ్రాజ్య క్షీణదశలో యథా పూర్వము అమరావతి – ధాన్యకటకము రాజధానికి మరలివచ్చిరని కొందరు చరిత్ర కారులు సమన్వయము సాధించుచున్నారు. అమరావతి – ధాన్యకటకము కృష్ణానది కిద్దరి అద్దరి విలసిల్లిన పట్టణము ఆంధ్రుల తొలిరాజధానియని విశ్వసింపవచ్చును.

# ఇక్ష్వాకులు

ఆంధ్రదేశమున నేటికి గూడ – చాల పురాతన కాలమునాటి ప్రస్తావనగా అది ఇక్ష్వాకులనాటి మాట అనుట కద్దు.

ఏ ఇక్ష్వాకులనాటి వృత్తములో యీ కృష్ణా నదీవాఃకళా
చ్ఛాయా స్వప్నపరంపరా శిథిలముల్ సాక్షాత్కరించున్ మహా
మాయామేదుర్ మేఘవాటికల శంపామాలికా జ్యోతులై
మా యాంధ్రావని బౌద్ధశిల్పముల సమ్యక్పూర్వ సంభావనల్

పురాణములలోని శ్రీపర్వతీయులైన ఆంధ్రభృత్యులే నాగార్జునకొండ జగ్గయ్యపేట శిలాశాసనములలోని ఇక్ష్వాకులు.

శాతవాహన సామ్రాజ్యము అస్తమించిన పిమ్మట నేటి గుంటూరు కృష్ణా మండల ప్రాంతమున కృష్ణానది కిద్దరి అద్దరి నాగార్జునకొండ ప్రాంతమున ఇక్ష్వాకులు పరిపాలించినారు. నాగార్జునకొండ శిలాశాసనములలోని దీర్ఘ రేఖారమణీయమైన అలంకారిక లిపి చినగంజాములోని యజ్ఞ శ్రీ శాతకర్ణి శాసనాక్షరములకు మూడవ పులోమావి జంగ్లిగుండు శిలాశాసనాక్షరములకు సుందర పరిణామ వికాసము. ఇక్ష్వాకు రాజుల నామధేయములలోని సిరి – సామి పదములు శాతవాహన ప్రభావమును స్ఫురణకు దెచ్చును. ఇక్ష్వాకుల రాజధాని విజయగిరి చులధమ్మగిరికి పశ్చిమమున నుండెను.

పురాణములను బట్టి ఇక్ష్వాకులు ఆంధ్రులు ధర్మామృతము అను కన్నడ గ్రంథమున క్రీ॥శ॥ 2వ శతాబ్దినాటి వసుపూజ నామధేయుడగు 12వ తీర్థంకరుని కాలమున ఆంధ్రదేశమునందు ప్రతీపాలపురమును అంగదేశమును పాలించిన ఇక్ష్వాకురాజు యశోధరుడు నిర్మించినట్లున్నది. ప్రతీపాలపురమనగా భట్టి ప్రోలు అని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు గుర్తించినారు. ఇక్ష్వాకురాజులు

సూర్యవంశజులైన అయోధ్యను పాలించిన రాజుల సంతతి అని పురాణకథనము రాజ్యసంపాదన చేసిన వీరులు తమ పరాక్రమ కృత్యములకు అనువైన ప్రాచీన వంశములకు అనుబంధముగా తమ వంశవృక్షము నేర్పరుచుకొనుట భారతదేశ చరిత్రలో పరిపాటియైన విషయము. ఇక్ష్వాకులు ఆంధ్రులని పురాణములు కంఠోక్తిగ చాటుచున్నవి. అంతేగాక వారికి శాతవాహనులకు గల కుటుంబ సాదృశ్యములు సుస్పష్టములు. కాళిదాస మహాకవి రఘువంశము ఆ నాటికి విశేష విఖ్యాతి నార్జించియుండుట ఊహింపవచ్చును. ఆ రాజవంశమువారు ఇక్ష్వాకువంశాభినుతులగుటకు అదిగూడ కారణము కావచ్చు. అంతేగాక వారు కాళిదాస మహాకవి వర్ణించిన ఆదర్శప్రభువుల అడుగుజాడలలో నడచుకొన్నారు. అది చెప్పుకొనదగిన గొప్ప విశేషము. వారు పరిపాలించినది అర్థశతాబ్ది మాత్రమే కాని వారి కీర్తి చిరస్థాయిగ నిల్చియున్నది.

నేడు నాగార్జునకొండ లోయలోని బౌద్ధశిథిలావశేషములన్నియు చాల వరకు ఇక్ష్వాకుల కాలము నాటివే.

సిరి చాంతిమూలుడు – అగ్నిష్టోమ – అగ్నిహోత్ర– అశ్వమేధ వాజపేయ యజ్ఞములను చేసినాడు. ఇతడు అనేక కాంచన రాసులను గోవులను దానము చేసినాడు. నాగార్జునునికొండ లోయలోని త్రవ్వకములలో అశ్వమేధయాగశాల యజ్ఞాశ్వ కంకాళముగూడ బయలుపడుట చెప్పుకొనదగిన విశేషము. చాంతిమూలుని హిరణ్యపిండదానము ఒక శిల్పములో ఉల్లేఖింపఁబడినది. ఇక్ష్వాకు చక్రవర్తి చేసిన శతసహస్రహల ప్రదానము చిరస్మరణీయమైనది. ఒక లక్ష నాగళ్ళను దానముచేయుట – అనగా ఆనాడు అధికాహారోత్పత్తిని ఇక్ష్వాకులు ఒక రాజనీతిగా గాక – ఒక మహాయజ్ఞముగా ఒక పరమ పవిత్ర కర్తవ్యముగా స్వీకరించి నెరవేర్చినట్లు ఎంచవచ్చును.

శిలాస్తంభముపైనున్న శిల్ప ప్రతిమలలో రాజఠీవితోగన్పించు మహారాజ విగ్రహమున్నది. అది సిరి చాంతిమూలుని ఆకృతి కావచ్చు. అతడు మత్తేభము

నధిష్టించియున్నాడు. అతనికొక అనుచరుడు ముత్యాలగొడుగు పట్టియున్నాడు. ఇద్దరు రాణులున్నారు. ఒక మరుగుజ్జు సేవకుడు కన్పించున్నాడు.

వీరపురిసదత సిరిచాంతమూలుని పుత్రుడు. ఇతని కాలమున బౌద్ధమతము మహోజ్జ్వలముగ వర్ధిల్లినది.

ఇక్ష్వాకురాజులు సనాతన వేదమతావలంబులు. యజ్ఞయాగాదులు శతసహస్రహల ప్రదానము చేసి విశ్వశ్రేయస్సును ఉపాసించిన ప్రగతి శీలురు.

కాళిదాస మహాకవి ప్రపంచించిన ఆదర్శములను కార్యరూపమున అనువదించిన అనుష్ఠాన వేదాంతులు ఆంధ్రసమ్రాట్టులైన ఇక్ష్వాకులు-

# ఆంధ్ర శాతవాహన యుగములో ఆంధ్ర సంఘ వృత్తములు

క్రీస్తుపూర్వము – మూడవ శతాబ్ది నుండి క్రీస్తుశకము రెండవ శతాబ్ద్యంతము వరకు – సుమారు అయిదు శతాబ్దులు యావదాంధ్రముతోపాటు దక్షిణాపథమును పరిపాలించి ఉజ్జయినీ రాజ్యముపై పలుసారులు అధిపత్యము వహించి ఒకానొకపుడు పాటలీపుత్రమును – మగధనుగూడ శాసించినది శాతవాహన సామ్రాజ్యము. అలనాటి యాంధ్ర సంఘ వృత్తములను పరిశీలించుట కాధారములు:–

1. శాసనములు
2. నాణెములు
3. చరిత్రకారుల రచనలు
4. శిల్పములు
5. గాథాసప్తశతి; కాళిదాసు కృతులు
6. బృహత్కథ మాతృకగాగల కథాసరిత్సాగరము
7. జైనగాథలు
8. రోమను రచయితల సాక్ష్యము
9. పురాణములు
10. విదేశ భౌగోళిక రచయితల సాక్ష్యము మున్నగునవి.

రాజు – రాజతంత్రమున సర్వాధికారి. రాజ్యాధికారము 'కులపురుష' పరంపరాగతము. రాజు ఇరువదియవ సంవత్సరమున పట్టాభిషిక్తుడగును. 15వ సంవత్సరమున యౌవరాజ్యపట్టాభిషేకము జరుగుట కద్దు. రాజు బహు భార్యా యుతుడైనను సింహాసనమునకు వారసత్వ యుద్ధములు ఆ నాడు కనిపించవు.

యౌవరాజ్య పట్టాభిషేకము ఈ వివాదముల నరికట్టిన వ్యవస్థ.

ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యమున కన్పించు మతసహనము ఉగ్గడింపదగినది. మగధసామ్రాజ్యమున అశోకుని కాలమునుండి బౌద్ధమతమునకు రాజాదరణము లభించినది. కాని అశోకుడు తానెంతటి ప్రగాఢ బౌద్ధుడైనను అన్య మత సహనముగలవాడు. కాని మౌర్యసామ్రాజ్య పతనానంతరము శుంగులు సనాతన వైదిక మతావలంబులై బౌద్ధులను హింసించినట్లు తెలియనగును. చాలా మంది బౌద్ధులు మగధనుండి ఆంధ్ర శాతవాహన రాజ్యమును చేరినారు. పురాణములు 'మహాన్' శతకర్ణియని ప్రశంసించిన శాతవాహన చక్రవర్తి రెండు అశ్వమేధ యాగములను చేసినాడు. గౌతమీపుత్ర శతకర్ణి అనేక యజ్ఞయాగములు చేసి రామనహుషయయాతులను ఆదర్శముగా స్వీకరించినాడు. అందుచే అతడు సనాతన వైదిక మతస్థుడనుట తెల్లము. కాని యతడు బౌద్ధభిక్షులకు చేసిన దానములున్నవి. అతని తల్లి బాలశ్రీ బౌద్ధభిక్షులకు చేసిన దానము సుప్రసిద్ధము. రాజమాత బాలశ్రీ శాసనమున అర్థవంతమైన వాక్యము "గౌతమీపుత్ర శతకర్ణి పురుషార్థములన్నిటికి సమప్రాధాన్యము నొసగి"నట్లున్నది.

ఆదికాలమునుండి ఆంధ్రభూమి ధర్మాద్వైతసీమగ వర్థిల్లినదనుటకు బాలశ్రీ శిలాశాసనము ఉజ్జ్వలోదాహరణము. "అహింసోపరమోధర్మః" అను బౌద్ధమత సిద్ధాంతము ఆర్యసంస్కృతికి నూతనముగాదు. ఒకనాటి అర్ధరాత్రి శ్రీమతిని, చిరంజీవిని, సింహాసనమును పరిత్యజించి విశ్వశ్రేయస్సును అన్వేషించుచు "మహాభినిష్క్రమణము" నకు ఉపక్రమించినాడు కరుణార్ధ్ర హృదయుడైన బుద్ధభగవానుడు. ఆ మహానుభావుడు ఆజన్మ వైరాగ్యమును ప్రబోధింపగలిగెను. బౌద్ధమతము జీవితమున ఏకైకాశ్రమము -సన్యాసాశ్రమముగనే ఉద్భాసింపజేసినది. అది సామాన్య మానవులకు దుర్గమమైనది.

సనాతన భారతీయ సంస్కృతి మానవజీవితమును ఆశ్రమ చతుష్టయముగా

వింగడించినది.

బ్రహ్మచర్యము-గార్హస్థ్యము-వానప్రస్థము-సన్యాసము

నాలుగు ఆశ్రమములు క్రమపరిణామ వికాసమున అభిలషణీయములు. కాళిదాసమహాకవి ఈ విషయమును హృదయంగమముగ అభివ్యక్తము చేసెను.

"శైశవే (అ)భ్య స్తవిద్యానాం
యౌవనే విషయైషిణాం
వార్ధక్యే ముని వృత్తీనాం
యోగే నాంతేన తనుత్యజాం"-

రఘువంశజులైన రాజుల ఆదర్శములను వర్ణించుచు ఆ మహాకవి పల్కిన అభి భాషణమది. శైశవమునందు విద్యాభ్యాసముతో గూడిన బ్రహ్మ చర్యము ఆచరింపవలెను. యౌవనమున విషయోపభోగములను అనుభవింపనగుని, వార్ధక్యమున వానప్రస్థమని, అవసానకాలమున యోగిగా - సన్యాసాశ్రమమున తనువు త్యజింపవలెనని బోధించుచున్నది.

ఈ సమన్వయసాధన-ఆంధ్రభూమి ధర్మాద్వైతసీమగ చిరప్రతిష్ఠ నందుటకు పూర్వరంగమును సిద్ధముచేసినది. కాళిదాస మహాకవికి మూడు పురుషాంతరముల దూరములోనున్న గౌతమీపుత్ర శతకర్ణి పురుషార్థములకు సమప్రాధాన్యము నొసంగుటలో వింతలేదు.

శాతవాహనులనాటి ఆహార్యములు - వేష ధారణ - జంత్రవాద్య విశేషములు - అలంకార విశేషములు...తాళములు తప్పెట్లు - బూరాలు - ఛత్రచామరములు - కమండలువులు - ధనుస్తూణీరములు - ఆయుధములు - రథములు - మున్నగునవి కన్నులకు గట్టినట్లు అమరావతీ శిల్పములలో సాక్షాత్కరించుచున్నవి.

విశ్వ విఖ్యాతినార్జించిన "బ్రిటిష మ్యూజియము"లో ఒక సింహ ద్వారము

అమరావతి శిల్పముకై ప్రత్యేకింపబడినది. ప్రపంచ రాజధానులలోగల సుప్రసిద్ధ, మ్యూజియములలో అమరావతి శిల్పఖండములు ప్రత్యేక గౌరవస్థానములు అలంకరించు చున్నవి. అమరావతీ స్థూపమున గాంధార రోమను శిల్ప ప్రభావము సువ్యక్తము. తెలుగులో గల గండారుశబ్దము గాంధార శబ్దభవము.

అమరావతి యనుపేరు సముద్రాంతరమున సువర్ణద్వీపకల్పములో వెలసినది. జావాలోని బరాబరూరు శిల్పములు అమరావతీ శిల్పమునకు అనుకృతులనుట జగద్విదితము.

## సముద్రవ్యాపారము

ఆంధ్రదేశమునకు సుమారు ఆరువందల మైళ్ళ నిడివిగల సుదీర్ఘమైన తీరరేఖయున్నది. ప్రాచీనకాలమున - ఆంధ్రశాతవాహనుల కాలమున విదేశములతో, సింహళము - చీనా - బర్మా - పెగు - సువర్ణద్వీపము - జావా, సుమిత్రా మున్నగు దేశములతోమాత్రమే గాక పశ్చిమముననున్న ఈజిప్ట-రోముదేశములతో గూడ వర్తక వ్యాపరములు కొనసాగుచుండెడివి. అలనాడు కృష్ణా గోదావరి ముఖద్వారముల నుండి నౌకలు లోపలికి పోవుచుండెడివి. నాగార్జునకొండవరకు సముద్రనౌకలు కొన్ని వచ్చి విదేశ వస్తువులను దింపుచుండెడివి. క్రీస్తుపూర్వమునుండి అనుకూల ఋతుపవన ప్రేరితములైన వర్తకనౌకలు గ్రీకు ఈజిప్టులనుండి బయలుదేరి ఆంధ్రదేశమును చేరుచుండెవి. వినుకొండలో ప్రాచీన రోమకనాణెములు లభించినవి. నాగార్జునకొండ లోయలోని త్రవ్వకములలో - ఆంధ్రదేశమున పలుతావుల లభించిన రోమకనాణెములవలన అలనాడు సముద్రవ్యాపారము ఉన్నతస్థాయికి చేరినదని గ్రహింపవచ్చును. ఆంధ్ర శాతవాహన చక్రవర్తి పులోమావి నాణెములపై తెరచాపలు రెపరెపలాడు సముద్రపు నౌకబొమ్మ ఈ విదేశ వర్తకమునకు నేటికిని చెరిగిపోని చిహ్నముగ గన్పించుచున్నది.

ప్లినీ అను రోమక శాసనసభ్యుని ప్రవచనము చిరస్మరణీయము. రోమక యువతులు సహజమైన సిగ్గువిడిచి భారతదేశమునుండి దిగుమతియైన గాలితో నేయబడిన సాలెగూళ్ల వంటి చీరెలను ధరించి తిరుగాడుచున్నారనియు, అపార సువర్ణరాసులు ప్రవాహములుగ భారతదేశమునకు తరలిపోవుచున్నవని ప్లినీ రోమక శాసనసభనలో ప్రసంగించినాడు.

ద్వీపాంతరవర్తకముచేయు సాలెవారికి వర్తకసంఘములుండెడివి. ఆ సంఘమునకు 'శ్రేణి' యని అలనాటి పేరు. అవి నేటి బ్యాంకులవలె ధనమును స్వీకరించి, "వడ్డీ" చెల్లించుచుండెడివి. సాలెవారి 'శ్రేణి' 2000 కాహాపణములు (సువర్ణ నాణెములు) శాశ్వత మూలధనముగా స్వీకరించెడిది ఆచంద్ర తారార్కము. ఆ మూలధనముపై వార్షికముగావచ్చు వడ్డీ నాసికా గుహాభ్యంతరముల నొకదానిలో వసించు భిక్షులకు వస్త్రాదికముల నొనగూర్చుటకు వ్యయింపనంగీకరించెను. వార్షికమైన వడ్డీ 12 శాతము. అట్లే మరియొక వెయ్యి కాహాపణములకు 9 శాతము వడ్డీ. దీనివలన హెచ్చు మొత్తములకు హెచ్చు వడ్డీనిచ్చెడి వారని తెలుచున్నది. సాలెవారి శ్రేణులు ఆర్థిక ప్రాబల్యము పుంజుకొని ప్రజల విశ్వాసమును అంతగా చూరగొనగల్గుటకు కారణము సముద్రవ్యాపారము.

ఆంధ్రదేశమున పలుతావులలో లభించిన ప్రాచీన రోమక నాణెములు రోమునుండి భారతదేశమునకు ప్రవహించినట్లు ప్లినీ పేర్కొనిన సువర్ణ వాహినులలోనివే; నాగార్జునకొండలో రుద్రధర భట్టారిదేవి 170 దినారి మాసకములు దానముచేసినట్లున్నది. దినారి రోమక నాణెము. దీనారటంకాలు శ్రీనాథ మహా కవివరకు ఆంధ్రదేశమున వ్యాప్తిలోనున్నవి. శ్రీనాథునకు ముత్యాలశాలలో జరిగిన కనకాభిషేకములో దీనారటంకాలు కురిసినవి.

హాలసంకలితమగు గాథాసప్తశతిలో తరచుగ విదేశగతుడైన భర్తకై నిరీక్షించు లేజవరాండ్ర వర్ణనలు కన్పించుచున్నవి. సంఘమునకు సారస్వతమునకు బింబ

ప్రతిబింబ భావము గలదు. గావున ఆంధ్రుల సముద్ర వ్యాపారమునకు ఇది అంతరంగిక సాక్ష్యము. 1

---

1. ఆంధ్రుల సముద్రవర్తకము అలనాటినుండి నేటివరకు సాగుచునేయున్నది. అప్పుడప్పుడు ఏర్పడిన అంతరాయములను దూరదృష్టి గల ప్రభువులు తొలగించి సముద్రవర్తకము నిర్విఘ్నముగ కొనసాగించుటకు చేసిన యేర్పాటులు గణనీయములు. కాకతిగణపతి దేవ చక్రవర్తి క్రీ॥శ॥ 1245 సంవత్సరమున మోటుపల్లి రేవులో ప్రకటించిన అభయశాసనము పేర్కొనదగినది. ఆ శాసనము ఇప్పటికిని మోటుపల్లిలోని వీరభద్రేశ్వరాలయ స్థంభములపై చెక్కబడియున్నది. మంచి గంధము, దేశీయకర్పూరము, చీనాకర్పూరము, ముత్యాలు పన్నీరు దంతము పట్టునూలు అత్తరులు మిరియములు పునుగు కర్పూర తైలము, రాగి, తగరము, పట్టు వస్త్రములు, పోకలు... మున్నగుపై విధించెడి సుంకములు పేర్కొనబడినవి. ఆ సముద్ర వర్తకులకుగాని - సరుకులకుగాని హాని కల్పించువారికి తీవ్రదండన విధించబడునని గణపతి చక్రవర్తి ప్రకటించి సముద్రవర్తకము నిరాఘాటముగ కొనసాగించుటకు ఏర్పాటుచేసినాడు. ఆ రేవులోనే మార్కోపోలో అను వెనీసు యాత్రికుడు క్రీ॥శ॥ 1290లో దిగినాడు. అచ్చటి దారము నూలు, రవసెల్లా వస్త్రాలు ప్రపంచములోకెల్ల శ్రేష్ఠమైనవని అతడు వ్రాసియున్నాడు. క్రీ॥శ॥ 1323లో ఓరుగల్లు పతనానంతరము అరాజ కత్వమేర్పడినది. కాని మల్లారెడ్డి తిరిగి మోటుపల్లిని జయించినసంగతి చరిత్రకారులకు తెలిసినదే. అతని అన్నకొడుకు అనపోతారెడ్డి తిరిగి ఒక అభయశాసనమును తమిళాంధ్రభాషలలో అచటనే వేసి సముద్రవ్యాపారమును పునరుద్ధరించెను.

శ్రీనాథునికాలము సముద్రవర్తకమునకు స్వర్ణయుగము అనిపించును. హరవిలాస కృతిభర్త అవచి తిప్పయసెట్టి చీనానుండి చీనాంబరములు, పట్టుబట్టలు,

సింహళమునుండి ఏనుగులు రత్నములు, పంజారనుండి కర్పూరపాదపములు రసములు జలనోగినుండి బంగారుములకలు హురుముంజినుండి గుఱ్ఱములు

స్త్రీలు

సంఘములో గృహిణికి ఉన్నతస్థానముండెడిది. రాణులు బాలకులైన రాజపుత్రుల కాలమున రాజ్యమును శాసించిరి. అమరావతిలో స్తూపశిలలు తోరణములు ఎన్నియో దానములు చేసినది, ఆంధ్రగృహిణులు అమరావతి శిథిల శిల్పావశేషములలో స్త్రీలు జంత్రగాత్ర పరాయణలై బౌద్ధారాధనా నిమగ్నులయి, నాట్యసంగీత వినోదకాలక్షేపలములో పురుషులతో గలిసి సభావేదికలపై కన్పించుచున్నారు. ఒక వివాదసన్నివేశమును సూచించు శిల్పములో సభలో ప్రేక్షకులలో స్త్రీలసంఖ్యయే అధికము.

నాగార్జునకొండ లోయలోని బౌద్ధశిల్ప నిర్మాణములలో స్త్రీలు వహించిన పాత్ర గణనీయమైనది. వీరిలో రాజకాంత అడవి చాంతి సిరి (శాంతి శ్రీ) అగ్ర గణ్యురాలు. ఈమె మహాదానపత్ని, బుద్ధ ధాతునిక్షిప్తమైన మహాచైత్య నిర్మాణములో రుద్రధర భట్టారికామహాదేవి, ఒక అయన కంబము దానముచేసినది. ఇట్లే చాపిసిరినికాదేవి - చుల - చాంతి సిరికాదేవి కొన్ని దానములు చేసినారు. అడివి చాంతిసిరి వీరపురుషదత్త మహారాజు 18వ సంవత్సరమున అతని ఆయుర్విజయములకు ఒక ఆలయము కట్టించినది.

"అపనొజామాతు కసరాజ్ఞో మాధరాపుత సఇక్ష్వాకునం సిరిరాపురిసద తస ఆయువరదనికె విజయితె..."

నాగార్జునకొండ లోయలోని ప్రాచీన బౌద్ధవిహార శిల్పవిన్యాసములు స్తూప

---

గోవానుండి సంకుమదము, యాపగనుండి కట్టాణిముత్యములు

భూటాన్‌నుండి కస్తూరి, తరుణాసేరి (టెన్సిసరి) నుండి తవాయిగోవ రమన్నస్థానమునుండి చందనము, అగరు కర్పూరము మున్నగునవి తెచ్చెడివాడట.

యూరోపువాసులు సముద్రవర్తకమునకై విరగబడి ఆంధ్రమునకు వచ్చిన సంగతి నవీనయుగమునకు సంబంధించినదే. నరసాపురము ఇంజరము కోరంగి మచిలీపట్టణము జగన్నాధపురము (కాకినాడ) సుప్రసిద్ధమైన రేవుపట్టణములైనవి. పంతొమ్మిదవ శతాబ్దిలోని ఉప్పెనతాకిడి తగులకపోయినచో మద్రాసుకాక మచిలీపట్టణమే దక్షణభారతమున ఆంగ్లసామ్రాజ్య రాజధానియై యుండెడిది. ఉప్పెన - మచిలీపట్టణమునేగాక ఆంధ్రచరిత్రనే మార్చివేసినది. శిల్పసౌందర్య విలాస విభ్రమములు చాంతిసిరి అమృతహృదయమునకు అమరత్వమును కల్పించినవి.

రాజకాంతయైన చాంతిసిరితోపాటు నాగార్జునకొండ లోయలలోని బౌద్ధ శిల్పములకు సౌందర్య రేఖావిన్యాసములు సమకూర్చిన సామాన్యగృహిణి బోధిశ్రీ చిరస్మరణీయురాలు. ఈమె బుద్ధాంచికా రేవతులపుత్రిక. ఈమె నివాస స్థానము గోవగ్రామము. కోశాధిపతియైన భద్రుని మేనగోడలు. ఈమె రెండు 'చైతియ-ఘర' లకు పునాదులు కట్టించినది. చులధమ్మగిరిపై ఈమె కట్టించిన విహారము సింహల బౌద్ధభిక్షులకు ప్రత్యేకావాసము. దీనినిబట్టి సింహళమునుండి ఆనాడు ఆంధ్ర దేశమునకు బౌద్ధభిక్షులు విద్యాభ్యాసముకొరకు వచ్చుచుండెడి వారని తెలియు చున్నది. నాగార్జునుని శిష్యుడు ఆర్యదేవుడు సింహళీయుడు. ఇహవుళ శాంతమూలుని భగిని కాదబలసిరి. 2వ రాజ్య సంవత్సరమున భిక్షకుల కొరకు కట్టించిన దేవీవిహారము పూర్తియైనది. ఈ విహారము ఈశాన్యదిశకు ఇటుకరాళ్ళ బోదుపై నున్నది. ఇచ్చటనుండి కృష్ణా నదీప్రవాహము రమణీయ దృశ్యముగ సాక్షాత్కరించును.

చాంతిసిరి విశ్వసంసారమునకు - స్వకుటుంబమునకు ఐహికాముష్మిక సుఖములను అర్థించినట్లు శాసనసాక్ష్యము.

ఆంధ్రదేశమున - శాతవాహనుల కాలమున ఇక్ష్వాకుల కాలమునగూడ గమనింపదగినవిశేషము చక్రవర్తులు పరమత సహిష్ణుతగల సనాతన వేద మతావలంబులు. అశ్వమేధ రాజసూయ యజ్ఞయాగాదులు నిర్వర్తించినారు. రాణులు బౌద్ధమత ప్రియలు. రాజులలో పరాక్రమము రాణులలో దయాళుత రాశీ భూతమై, సుందర సుకుమార ధర్మసమన్వయము సాక్షాత్కరించినది. అది ఆంధ్ర సంస్కృతిలోని నిత్యచైతన్యపూరితమైన ధర్మాద్వైత వేదాంతము-

విశ్వకవి రవీంద్రుడు - ఆంధ్రవిశ్వకళాపరిషత్తునకు విచ్చేసినపుడు - ఆంధ్రుల సారస్వతాభిరుచికి 'సప్తశతి' ఉదాహరణ ప్రాయమైనదని ప్రస్తుతించినాడు.

విశ్వసాహితీజగత్తులో కథావాఙ్మయమునకు మకుటాయమానమైన రచన బృహత్కథ, శాతవాహనయుగములోని సారస్వత సృష్టికి సప్తశతి - బృహత్కథ గౌరీశంకర శిఖరములు.

సప్తశతి ఏడువందల ముక్తకముల సంకలనము. ఈ సంకలనకర్త హాల చక్రవర్తి. 'సప్తశతి' కి విశ్వసాహితీ జగత్తులో విశిష్టస్థానమున్నది. కావ్యాత్మ 'ధ్వని' అనుట ప్రపంచములోని అలంకారికులలో అధిక సంఖ్యాకుల ఆమోదముద్ర వడిసిన అభిప్రాయము. 'సప్తశతి' లోని ప్రతిపద్యము ఒక సుకుమార సుందర మనోహర ప్రబంధము. ధ్వని ప్రధానమైనదే ఉత్తమకావ్యమగుచో గాథా సప్తశతి జగదేకకావ్యము అని చెప్పక తప్పదు.

సప్తశతికి చారిత్రక ప్రాముఖ్యము గూడ గలదు. ఆ పద్యములు కల్పిత గాథా కదంబములు కావు. అందలి పాత్రలు బహుళముగా జానపద పాత్రలు జనసామాన్యములో నిత్య దినచర్యలో జరుగు వృత్తములే అందలి యితివృత్తములు. శాతవాహనులనాటి ఆంధ్ర సాంఘిక జీవితము ప్రతిఫలించు అద్దాలమేడ గాథాసప్తశతి.

కేవలము కావ్యదృష్టితో జూచినచో ఒక్కొక్క గాథ ఒక మహాకావ్యము.

అల్పాక్షరముల అనల్పార్థ రచనకు ప్రపంచ సారస్వతములో గాథలకు సరితూగు రచనలు మృగ్యములు. అంతేగాక ప్రతి గాథ వెనుక ఒక చక్కని చిక్కని హృదయంగమమైన నిత్యజీవితానుభూతి తెరవెనుకనుండి పొంచి చూచుచుండును.

అంతేగాక గాధాసప్తశతిలో ప్రతిఫలించుచున్న ఆంధ్రుల కవితాభిరుచికి యావజ్జగత్తు కర్పూర నీరాజనము సమర్పించుచున్నది. సాహిత్యములో అభిని వేశము వేరు. అభిరుచి వేరు. 'అభిరుచి' వలననే ఏతత్ సంస్కృతికి విలువ గట్టనగును.

'షేక్స్పియరు' మహాకవికే ఆంగ్లేయుల రవియస్తమించని సామ్రాజ్యము కంటె విలువ హెచ్చు. ఆ మహాకవి సంగీత సాహిత్య రసికుడుకానివానికి ఉరిశిక్ష వేయదగునని ఉద్ఘాటించినాడు. అట్టివానికి "ఉరిశిక్ష" వేయనవసరము లేదు. అట్టి జీవితమే పెద్ద శిక్ష. ఇక వేరు శిక్ష వేయనేల? అని సప్తశతి చెప్పిన తీర్పులో ప్రతిఫలించుచున్న అభిరుచికి ప్రపంచంలో నెచ్చటైన సంస్కృతికి విలువగట్టగల సహృదయులు తలలూపకపోరు.

సరసకవితయన్న – సంగీత కళయన్న
వ్యంగ్యమన్న – లలిత హాస్యమన్న
అవని విముఖులున్న అదియె వారికి శిక్ష
రమ్యహాసలోల రామకృష్ణ.

అట్టివారికి మరణశిక్ష కంటె అట్టిబ్రతుకే పెద్దశిక్ష. ఇక సప్తశతిలోనున్న కవితకు మచ్చుతునకలు సహృదయ హృదయైక వేద్యములైనవి యుదహరింపనగును. ఒక లేజవరాలు బాటసారియైన విద్వద్ యువకునితో అనుచున్నది.

పాంథకిశోర! నీ చిరుత ప్రాయము చెప్పెడి మోము; చేతి ఉద్
గ్రంథము చూడ వైద్యుఁడవు గావలె! జ్యోతిష పండితుడవో!

అంథత మూల్గు అత్తగృహమందు; నవోఢను; వార్థిదాటి సౌ

గంధిక వర్తకుండగు మగండరుదెంచు దినమ్ము తెల్పుమా!

ఇది యొక గాథ.

ఆమె నవయౌవనాంగి నవోఢ నూత్న వధువును విడిచి సుగంధ వర్తకుడైన భర్త సముద్రాంతరములకు వెడలినాడు. ఆ విరహిణికి ఒక మనోహరరూప యౌవనోద్భాసితుడైన విద్వద్ యువకుడు తారసిల్లినాడు. ఆ లేత జవరాలు అనవయువకునితో ననుచున్న మాటలు అవి.

"బాటసారిగా విచ్చేసిన ఓ నవయువకుడా! నీ మొగము నీ నవయౌవనమును ప్రస్ఫుటింపజేయుచున్నది. నీచేతిలోని యుద్గంథమును జూచినచో వయసుకు మించిన మేటి విద్యాంసుడవైనట్లు తోచుచున్నది".

"నీవు వైద్యుడవా? జ్యోతిష్కుడవా?" అని అడిగినది.

అతడు ఒక వేళ వైద్యుడే అగుచో – ఆమె ముసలత్త గారు – అంధత్వముతో మూల్గుచు మూలపడియున్నది కాబట్టి వచ్చి వైద్యము చేయవలెనట.

అతడు – జ్యోతిష్కుడే అయినచో – విరహార్త యైన తన్ను విడిచి సముద్రముదాటి విదేశములకు పోయిన సౌగంధికవర్తకుడైన తన భర్త ఎపుడు వచ్చునో చెప్పవలెనట. ఆమెకు పాపము ముసలిఅత్తపై ఎంతటి ప్రేమాతిశయము!

భర్త – నవోఢయైన తన్నువిడిచి వెళ్లెను ఈ మధ్యనే పెండ్లియైనదన్నమాట – అయినచో ద్వీపాంతరగతుడైన భర్త అంత శీఘ్రముగా రాగలడా? ఆ సంగతి ఆమెకు తెలియదా? కాని ఇందు అంతర్గర్భితమైన 'ధ్వని' అనుభవైకవేద్యము–

తానా విరహిణి నవయౌవనవతి అతడా యువవిద్వాంసుడు.

తన యింటిలోనున్నది అంధురాలైన ముసలి అత్తగారు. భర్త – యింటిలో కాదుగద, ఊరిలో కాదుగద – దేశములో గూడ లేడు. సముద్రాంతరగతుడు.

ఇందు ప్రత్యక్షరముమాటుననుండి అనురాగగర్భితమైన ఆహ్వానము తొలుకాడు చున్నది.

ఇది సహృదయ హృదయైకవేద్యము.

సుకుమార సుందర మనోహరకల్పన సప్తశతిలోని ఏడువందల ముక్తకములు నిట్టివే.

కథావాఙ్మయమున ప్రపంచమున అగ్రతాంబూలమును అందుకొనదగినది గుణాఢ్యుడు వ్రాసిన బృహత్కథ. ఆంధ్రులు ప్రాచీనకాలమున చదివినది 'కాసట – బీసట' అనగా గాథా సప్తశతి – బృహత్కథ.

గుణాఢ్యుడు బృహత్కథను పైశాచీప్రాకృతమున రచించినాడు. అది నేడు ఉపలభ్యముగాకపోయినను, ఆ మాతృకననుసరించి వెలువడిన సంస్కృత గ్రంథములు:

i. సోమదేవుని కథాసరిత్సాగరము
ii. క్షేమేంద్రుని బృహత్కథామంజరి
iii బుద్ధస్వామి బృహత్కథాశ్లోక సంగ్రహము.

ఆమహాకావ్యప్రతిష్ఠకు విజయధ్వజములు.

మేఘసందేశమున యక్షుడు మేఘునితో ఉదయన కథాకోవిదులైన గ్రామ వృద్ధులనుగూర్చి ప్రస్తావించుటచే ఆ కాలమున బృహత్కథకుగల ప్రాచుర్యము సుగమము.

బృహదాంధ్రము

భారత ద్వీపకల్పమున సముద్రతీరమంతయు దక్షిణాపథమును ఆవరించియున్నది. దక్షిణాపథమున నౌకాయానమున ప్రాచీనకాలమున మిక్కిలి ప్రసిద్ధికెక్కిన రాజ్యములలో నెన్నదగనది. ఆంధ్రరాజ్యము. ఆంధ్రుల త్రిసముద్రాధి

పత్యమును బాణుడు ప్రస్తుతించినాడు. కృష్ణా గోదావరీ వంశధారా నదీముఖములు. ప్రాచీనకాలమున సముద్రయానములో నౌకాశ్రయములుగవర్ధిల్లినవి ఆంధ్రమహాసామ్రాజ్యమున గోదావరీ కృష్ణానదులు వ్యాపారనౌకలకు రహదారులైనవి. రోమక సామ్రాజ్యమునుండి చీనాదేశమునుండి సుమిత్ర - యవద్వీపములను సువర్ణ కామరూప భూముల నుండి సముద్రనౌకలు కృష్ణానదీ ముఖద్వారమున ఆంధ్ర శాతవాహన రాజ్యమున ప్రవేశించుచుండెడివి. నాగార్జునకొండ విశ్వకళా పరిషత్తులో చీనా సింహళ బౌద్ధ భిక్షుకులు విద్యాభ్యాసము చేసెడివారు. నాగార్జున కొండవరకు చీనారోమక సామ్రాజ్యములనుండి సముద్రనౌకలు వచ్చి ఒక విశాల పర్వతసాను వేదికపై సరకులను దింపుకొను చుండెడివని యూహింపవచ్చును. పులోమావి నాణెములపై సముద్రనౌక బొమ్మ ఉండుట సుప్రసిద్ధము. ప్లినీ - రోమకశాసన సభ్యుడు గోదావరీ ముఖద్వారము వివిధదేశ సముద్రనౌకలకు సంగమస్థానమనియు అక్కడనుండి నావలు గంగాముఖద్వారము చేరుచుండెడివని వ్రాసి యున్నాడు. అలెగ్జాండ్రియా వాస్తవ్యుడైన వ్యాపారి వ్రాసిన "పెరిప్లసు" అను గ్రంథములో క్రీ.శ. 80 ప్రాంతమున కృష్ణా గోదారీ ముఖములందున్న రేవుపట్టణములను పేర్కొనినాడు. గ్రీకు భూగోళజ్ఞుడు టోలమీ గూడ క్రీ॥శ॥ 140 ప్రాంతమున కృష్ణాముఖద్వారమును నాగార్జునని కొండదగ్గరనున్న కంటకసిల వ్యాపార కేంద్రమును పేర్కొనినాడు. పెరిప్లసు గ్రంథకర్త సన్నని నూలు - రంగు వస్త్రములు అద్దకములు వాణిజ్య కేంద్రములగు వాగరా ప్రతిష్ఠానమునకు - భూమార్గమున మైసోలోసు (కృష్ణా ముఖద్వారము) చేరుచుండెడివని వ్రాసియున్నాడు. గోదావరి ముఖద్వారమునుండి సువర్ణభూమికి నావలు పోవుచుండెడివని టోలిమి వ్రాసినాడు. మలయ - సుమిత్ర ద్వీపముల లోని సుగంధ ద్రవ్యములు - తూర్పు సముద్రములోని పగడములు కర్పూరము చీనాంబరములు ఆంధ్రదేశములోని ఫణిగ్వీథులలో సుపరిచితములు.

"హాతిగుంఫ" శిలాశాసనములో ఖారవేలుడు జైనసన్యాసులకు

చీనాంబరములు ఇచ్చినట్లున్నది. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలమున జెండాకుగట్టిన చీనాంబరమును ప్రస్తావించెను. బాణుడు ఆంధ్రుల సముద్ర వ్యాపారమును ప్రస్తుతించెను సముద్రాంతరమున నున్నదేశములలోని పట్టణముల పేరులు ఆయాదేశములకు ఆంధ్రదేశమునకు గల ప్రాచీనానుబంధమును సువ్యక్తము చేయుచున్నవి. అరకాను రాజధాని నగరము పేరు ఆనాడు త్రిలింగ. అందు కాకుళము ఒక పట్టణము. ఈ నామములు ఆంధ్రనావిక వీరులు ప్రాచీనకాలమున తమ అధినివేశరాజ్యములకు అప్యాయతముతో మాతృదేశాభిమానముతో పెట్టుకొన్న పేరులు. జావాద్వీపములోని శిల్పములు అమరావతి శిల్పకళకు ప్రతికృతులు బర్మాలోనున్న తైలింగులు ఆంధ్రుల సంతతివారని "పయిరె" రచయిత అభిప్రాయము. టోలిమీ "త్రిల్లింగన్" ను పేర్కొనినారు. గోదావరీ మహానదీ మధ్యస్థదేశమును ప్రాచీనకాలమున కళింగమని వ్యవహరించినారు. త్రికళింగములో ఒకటి తెలుగు కళింగము ఒకటి ఉత్కళ కళింగము. ప్రాచీన తైలింగ్ లిపి "వేగి" లిపికి సామ్యమున్నది. బర్మాలో - ప్రాచీనాంధ్రలిపిలో శాసనములున్నవి.

ప్రాచీనకాలమున ఆంధ్రరాజ్యమునకు చీనాకుమధ్యనున్న మజిలీ మలయ ద్వీపకల్పము. దీనికే ఆనాడు సువర్ణభూమి అనిపేరు. ఇండోచీనా ప్రాచీన కాలమున అమరావతి - విజయ - పాండురంగ రాష్ట్రములుగ భాసించినది. అందు దొరికిన ప్రాచీన శిలాశాసనములు క్రీ.శ. మూడవ శతాబ్దినాటివి ప్రాచీనాంధ్రలిపిలో నున్నవి. ఆనాడు "చంప" దేశము (ఇండోచైనా) వాడినది ప్రాచీనాంధ్ర లిపియే. ప్రాచీన చంపరాజులు చంద్రవర్మ వేదవర్మ జయవర్మ పేరులు వేంగి రాజుల పేరులను స్మరింప జేయుచున్నవి. చంపారాజ్యములోని శాసనములు సంస్కృతభాషలో నున్నవి. అందు వారు శాలివాహన శకమునే వాడుట గమనింపదగిన విశేషము.

సింహళ ద్వీపమునకు ఆంధ్రదేశమునకు పురానుబంధములు గలవు. ఆంధ్రదేశము నందలి బౌద్ధబిక్షుకులు - కాశ్మీర - గంధార - చీనా - కోసలి

అపరాంత వంగ వనవాస యవన ద్రమిళ సింహాళ దేశములకు బౌద్ధదీక్షలిచ్చినట్లు నాగార్జున కొండలోయలోని శాసనములబట్టి తెలియుచున్నది. దత్తగ్రామణి అమరావతి స్తూపమునుండి బుద్ధదాతులను సింహాళమునకు తీసికొనిపోయి మహాస్తూపమును కట్టించినాడు. ఆ మహోత్సవమునకు మహాదేవునితోపాటు వేనకువేలు బౌద్ధభిక్షులు పల్లవబొగ్గనుండి వచ్చిరి. పల్లవబొగ్గ ఆంధ్రదేశమునందలి గుంటూరు మండలమందలి పల్నాడు. సింహాళములో బెజవాడ దగ్గరనున్న ఉండవల్లి గుహలను పోలిన గుహలున్నవి. జావాద్వీపమునకు ప్రాచీననామము కళింగము. ఆ పేరు ఆంధ్ర దేశాంతర్గతమైన కళింగమునుండియే సంక్రమించినదనుట అచటి ప్రాచీన శాసనములు ఆంధ్రలిపి సాక్ష్యము - అంతేగాక అచటి శిల్పములు అమరావతికి ప్రతికృతులు, జావాలోని బరాబదూరు పాషాణశిల్ప ప్రతిమలు చరిత్రకారునికంటె సుందరముగా ప్రాచీనాంధ్రశిల్ప కళాభ్యున్నతిని మౌనముగా యావత్ ప్రపంచమునకు చాటిచెప్పుచున్నవి. సుమిత్రాద్వీపములో ఏడంతస్థుల బౌద్ధవిహారము గట్టించినారు. ఈ ద్వీపములో బుద్ధప్రతిమలు అమరావతీ బుద్ధప్రతిమలకు ప్రతికృతులు.

బిక్షు చమన్‌లాలుగారు "హిందూ అమెరికా" అను తమ గ్రంథములో ఒక అధ్యాయమునకు "అమరావతినుండి అమెరికాకు" అను శీర్షికను పెట్టినారు. ఆంధ్రమున దక్షిణ అమెరికాలో ప్రాచీన దేవాలయములు శిల్పములు నాగరికత "అమరావతీ" సంస్కృతిని ప్రతిఫలించుచున్నట్లు నిరూపింపబడినది. దక్షిణ అమెరికాలోని "ఇరాక్సు" తెగవారు, దక్షిణభారతమందలి ద్రావిడుల సంతతి వారని "హెవేట్టు" గారి అభిప్రాయము.(1)

మెక్సికో లోని ఆదిమ నివాసులు తమ పూర్వులు ఇండియా నుండి సముద్రమార్గమున వచ్చినట్లు చెప్పుకొనినారు. మెక్సికో జాతీయ మ్యూజియమ్ క్యూరేటరుమెక్సికో ఆదిమనివాసులు ఇండియానుండి సముద్రయానమున అచటికి వలస వచ్చినట్లు నిర్ణయించినారు. సర్‌విలియం జోన్సు పండితుడు - పెరూ

దేశమునందలి ఆదిమనివాసులు - "ఇంకా" తెగవారు తాము సూర్య వంశీయులమనియు కౌసల్యసుతుడు - సీతా పతియైన రాముని దేవునిగా పూజించినారనియు వ్రాసియున్నాడు. మెక్సికోలోని పురాతన దేవవాలయములలో శివలింగములుండెడివి. బొలీనియాలో కైలాస దేవాలయముండెడిది. ఈవిషయములు శ్రీభిక్కుచమన్‌లాల్ గారి "హిందూ అమెరికా" అను గ్రంథములో సవిస్తరముగా కాననగును.

మెక్సికో - పెరూ - బ్రెజిల్ మున్నగు అమెరికన్ దేశముల ప్రాచీనచరిత్రను అనుశీలించుటకు ఆంధ్ర పరిశోధకులు ఆయా దేశములకు వెళ్లి - పరిశోధనలు సలిపినచో - ప్రపంచమును అద్భుతాశ్చర్యములలో ముంచు అనేక నూతన విషయములు బయల్పడగలవు. కొలంబసు కంటె కొన్ని వందల సంవత్సరములకు ముందే ఆంధ్ర వీర నావికులు అమెరికాలకు వెళ్లి - అచట సాంస్కృతిక సామ్రాజ్యములు నెలకొల్పినట్లు పరిశోధనల వలన తేలగలదు.

## శ్రీనాగార్జునాచార్యులు

ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యకాలమున చిరస్మరణీయుడైన పూర్ణ పురుషుడు శ్రీమన్నాగార్జునాచార్యులు. నేటి గుంటూరు మండలమున కృష్ణానదీ తీరమున అతని పేరు మీద వ్యవహృతమగుమన్న 'నాచార్జునుకొండ' అతని నివాసము.

నాగార్జునుడు శాతవాహనరాజు యజ్ఞశ్రీశతకర్ణికి సమకాలీనుడని చరిత్ర కారుల నిర్దేశము. యజ్ఞశ్రీశతకర్ణి క్రీ॥శ 123 నుండి 152 వ సంవత్సరము వరకు రాజ్యమేలెను. అతని శాసనము చినగంజాము వద్ద సముద్రతీరమున ఒక బండపై నున్నది. నాగార్జునుడు - శాతవాహన చక్రవర్తికి వ్రాసిన 'సుహృల్లేఖ' ను

---

1. అమెరికా సంయుక్తరాష్ట్రములు - శ్రీ అయ్యదేవర కాళేశ్వర రావు గారు

పుట 9

సింహళములో 'ఇట్సెంగు' అను చీనా యాత్రికుడు చీనా భాషలోనికి క్రీ॥శ॥ ఎనిమిదవ శతాబ్దిలో అనువదించినాడు. చీనా వాఙ్మయ చరిత్రలో నాగార్జునుని ప్రజ్ఞామూల శాస్త్రము హ్యూకన్ విద్వాంసుడు క్రీ॥శ॥ 190 – 221 సంవత్సరముల మధ్య అనువదించినట్లున్నదని "గైల్సు" అను ఆంగ్లేయ పండితుని ప్రవచనము. కావున నాగార్జునుడు క్రీ॥శ॥ ద్వితీయ శాతాబ్ద్యంతమున జీవించినాడని చెప్పవచ్చును.

నాగార్జునుని శిష్యుడు – ఆర్య దేవుడు సింహళరాజు వంశ చరిత్రయగు మహావంశములో క్రీ॥శ॥ 3వ శతాబ్దిలో పరిపాలించిన విహార తిష్యునకు – అభయునకు (209–219) సమకాలీనుడని గలరు.

తారానాథుడు – టిబెట్టు భాషలో అమరావతీ స్తూపమున నాగార్జునుడు బుద్ధ ధాతువును ప్రతిష్ఠించెనని వ్రాసియున్నాడు.

బౌద్ధమత ప్రపంచమున మాధ్యమిక వాదమును ప్రవచించిన వేదాంతి నాగార్జునుడు. నాగార్జునాచార్యుల వారు – బౌద్ధమతములో అర్వాచీనశాఖయైన మహాయాన ప్రోక్తమని కొందరు తలపోయుచున్నారు. మహాయానము నాగార్జునా చార్యులవారికంటె ముందే ప్రారంభించినప్పటికి అతని కాలములో నూత్న చైతన్యముతో విజృంభించినదనుట నిర్వివాదము.

ఐతిహ్యము నాగార్జునుని సర్వజ్ఞునిగా ప్రస్తుతించుచున్నది. బౌద్ధగాథలు సిద్ధపురుషునిగా పేర్కొనుచున్నవి. భారత భూమిలో ఆంధ్రదేశమునందైనను నాగార్జునుని గ్రంథములలో ఒక్కటి గూడ నేడు ఉపలభ్యమగుటలేదు. కాని ఆ గ్రంథములన్నియు ప్రాచీన చీనా వాఙ్మయము లోనికి అనువదింపబడియున్నవి.

ప్రజ్ఞాపారమితి శాస్త్రము – ప్రజ్ఞామూలశాస్త్ర టీకము – ప్రజ్ఞా ప్రదీపకారికలు మూలమాధ్యమిక శాస్త్రము – శూన్యసప్తాధి మాధ్యమికానుగమశాస్త్రము – దశభూమి విభాష శాస్త్రము – ద్వాదశ నికాయ శాస్త్రము – వివాద సామాన్య

శాస్త్రము - ప్రమాణ విహేతనము - ఉపాయ కౌశల్య హృదయ శాస్త్రము - విగ్రహవ్యావర్తిని కారిక ... మున్నగునవి చీనావాఙ్మయములో అనువాద రూపమున లభించుచున్న నాగార్జునుని గ్రంథములు.

నాగార్జునుడు సర్వతోముఖ ప్రతిభాశాలి. భారతీయ బౌద్ధ వాఙ్మయము నాగార్జుననికి కైవారము సమర్పించినది. అతడు సుశ్రుతమును పునరుద్ధరించెను. ఆరోగ్య మంజరిని కక్షపుత తంత్రమును వ్రాసెను. ప్రాచీన చీనాదేశములో నాగార్జునుని నేత్రనిదానము సుప్రసిద్ధము. ప్రాచీన కాలమున చీనాదేశములో వివిధ రోగములకు నాగార్జునుని చికిత్సలను శిలా శాసనములుగా చెక్కి పలుతావుల నాటినారట. విషవైద్యములో నాగార్జునుని చికిత్సను బాణుడు ప్రశంసించినాడు. నాగార్జునుడు స్వచ్ఛంద మరణమును సాధించిన సిద్ధపురుషుడనియు అతడు 150 సంవత్సరములు జీవించినాడనియు జనశ్రుతి. రసరత్నాకరములో నాగార్జునుని నివాసము శ్రీపర్వతము. నేడు శ్రీ నాగార్జున కొండకు ఆనాడు శ్రీపర్వతమని పేరు. ప్రాచీన నాగార్జున శ్రీపర్వత సంఘారామములో రసాయనిక పరిశోధనలు జరుగుచుండెడివి. రసరత్నాకరములోని, పాదరసయోగములు వజ్ర పరిశోధనమునుబట్టి నాగార్జునుడు భారతీయ రసాయనిక శాస్త్రపితామహుడని చెప్పవచ్చు. 'అన్నభేది' ని ప్రప్రథమమున నిర్మించినది అతడే. ఔషధ శాస్త్రములు - రసాయనిక ప్రయోగములు - ఖనిజ విద్య శ్రీపర్వత బౌద్ధ విశ్వకళాపరిషత్తులో నాగార్జున కులపతి ఆధ్వర్యమున విశ్వ విఖ్యాతిగాంచినది.

ఆర్యదేవుడు, నందుడు, నాగుడు నాగార్జునుని శిష్యులు. భావ వివేకుడు దిఙ్నాగుడు మున్నగు తాత్త్వికులు నాగార్జుననకు తరువాతివారు. దిఙ్నాగుని ప్రమాణ సముచ్ఛయము తర్కవిద్యాప్రపంచమున నాగార్జుననుని ప్రభావముద్రను యుగయుగాంతరములు దేశదేశములలో భాసింపజేసినది.

నాగార్జునుడు కవి, వేదాంతి - తార్కికుడు - ఖనిజశాస్త్ర పరిశోధకుడు. రసాయనిక విద్యాచక్రవర్తి. తార్కిక సార్వభౌముడు.

భారతీయ వేదాంత క్రమపరిణామ వికాసమును అనుశీలించినచో అద్వైత వాదప్రోక్తయైన శంకరాచార్యులువారి జగన్మిథ్యావాదమునకు పూర్వరంగ ప్రవర్తకులు బౌద్ధులని భావించు విద్వాంసులున్నారు. శంకరుని సమకాలీనులును అర్వాచీన విమతస్థులును అతని ప్రచ్ఛన్న బౌద్ధుడని అధిక్షేపించి యున్నారు. ఆదిశంకరుల కాలనిర్ణయము వివాదగ్రస్త విషయము వేదాంతములో నాగార్జునుని శూన్యవాదము- మిథ్యాతత్త్వము శంకరుని మాయావాదమునకు ఆర్యప్రకృతి కులపతి నాగార్జునుడు శంకరాచార్యులవారికి పూర్వరంగ ప్రవర్తకుడు.

నాగార్జునుని వేదాంతసారము – S.C. వైద్యభూషణముగారు భారతీయ వేదాంత చరిత్ర అను గ్రంథమున సమీక్షించియున్నారు. ఈ జగత్తు కేవలము మిథ్యగాదు. కేవలము తథ్యముగాదు. జగత్తు పరిమితి సత్యము. ఏ పదార్థమునకు నిరపేక్షకమైన అస్తిత్వము లేదు. జగద్వలయము ఈ సత్యమును కేంద్రముగా పెట్టుకొని పరిభ్రమించుచుండును. సృష్టిలయములు, అస్తిత్వనాస్తిత్వ సంబంధ భావములన్నియు మిథ్యలు. కావున మన భ్రమలకు ఆద్యప్రకృతులగుచున్నవి. అశాంతి దుఃఖములకు ఆలవాలమైన ఈ భ్రమలను మానవులు వీడలేనంతకాలము సుఖదుఃఖ డోలాకీలితమైన జీవితమునుండి విముక్తి లేదు. పరిమితత్వమున్న సత్యము లేదు. సత్యమును చేరుటకు పరిమితత్వమునుండి విముక్తి కలుగవలయును. అపుడు సత్యము లేక శూన్యము సాక్షాత్కరించును. శూన్యమే నిర్వాణము. నిర్వాణము నిర్వికల్పమైన వైరుధ్యములన్నియు అదృశ్యమైన "అపరిమితత్వము"

సర్వం క్షణికం క్షణికం

సర్వం దుఃఖం దుఃఖం

సర్వం శూన్యం శూన్యం

అని ప్రాచీనులు బౌద్ధవేదాంతసారమును మూడుముక్కలలో ముక్తసరిగా సంక్షేపించియున్నారు.

ఫాహియాన్ భారతదేశమును సందర్శించినపుడు దక్షిణమున "పారావత విహారము" సుప్రసిద్ధమైనదని వ్రాసియున్నాడు. దానిని పావురముల విహారమని చీనాయాత్రికుడు భ్రమించినది శ్రీపర్వత విహారమే. సర్వసామాన్యమగు 'శ్రీ' తొలగించి ఫాహియాన్ పర్వత శబ్దమును పారావాత శబ్దముగ భ్రమించియుండవచ్చు. దీనినిబట్టి శ్రీపర్వత విహారము నాగార్జునకొండ లోయలో క్రీ॥శ॥ 5వ శతాబ్దివరకు వర్ధిల్లినట్లు ఎంచవచ్చును. నాగార్జునకొండ ప్రాంతమున దొరికిన శాసనములందలి లిపి పరిణామమునుబట్టి చూచినచో ఆ విహారము యజ్ఞశ్రీ శతకర్ణికి సమకాలికముగా వికసించి రెండు మూడు శతాబ్దులు వర్ధిల్లినట్లు భావించనగును. అచ్చట బయల్పడిన శాసనములలోని లిపికి నాగార్జునకొండకు సంబంధించిన అలంకారిక లిపియని పేరు. ఆ లిపి యజ్ఞశ్రీ శతకర్ణి శాసనలిపితో సరిపోవుచున్నది.

మా నాగార్జున దేవుతత్త్వ కవితా మాధుర్యముల్ కృష్ణవే
ణీ నాట్యామృత గానవాహినుల యే నిత్యత్వ దివ్యప్రభా
పౌనఃపున్యములన్ వెలార్చినవొ యీ ప్రాచీనతా శిల్ప వి
జ్ఞానోపాసన తెల్గునేల మృగతృష్ణా రేఖలై తోచెడిన్

– – –

శాతవాహనసామ్రాజ్యము అస్తమించిన పిమ్మట - ఇక్ష్వాకులు - బృహత్పలాయనులు - శాలంకాయనులు - ఆనందగోత్రులు - విష్ణుకుండినులు రాజ్యము చేసిరి.

బృహత్పలాయనులు కూదూరు రాజధానిగా కృష్ణానదికి ఉత్తరతీరమును పరిపాలించినవారు ఈ రాజుల ఏకైకశాసనము కొండముది శాసనము ప్రాకృత భాషలో నున్నది. లిపినిబట్టి ఇక్ష్వాకులకు అద్యతన భవిష్యత్తులో రాజ్యము చేసినట్లు విజ్ఞుల అభిప్రాయము.

శాలంకాయనుల రాజధాని "వేంగి". నేటి పశ్చిమగోదావరి ఏలూరు సమీపమున పెదవేగి - చినవేగి అను పల్లెలు ఒక నాటి వేగీపట్టణము. వేంగీనగరము భారతదేశ చరిత్రలో పేర్కొనదగిన జలదుర్గము. దక్షిణమున కృష్ణానది ఉత్తరమున గోదావరి తూర్పున సముద్రము. ఆ మహాజలదుర్గములో అంతర్గతమగు జలదుర్గము వేంగీనగరము. ఇటు తమ్మిలేరు - అటు రావులేరు, కొల్లేరు సరస్సు, తూర్పు సముద్రము వేంగీనగరమునకు జలప్రాకారములు.

శాలంకాయనులు చిత్రరథస్వామికి భక్తులు. అశ్వమేధములు చేసినవారు. హస్తివర్మ కాలమున సముద్రగుప్తుని దక్షిణదిగ్విజయయాత్ర జరిగినది. శాతవాహన సామ్రాజ్యానంతరము ఆనాడు ఆంధ్రదేశము చిన్నచిన్న రాజ్యములుగ నేర్పడుటచేత సముద్రగుప్తుని దండయాత్ర నల్లేరుపై బండిగా కొనసాగినది.

శాలంకాయనుల తరువాత వేంగిని పరిపాలించినది విషుకుండినవంశజులు. వీరి రాజధాని దెందులూరు వేంగికి సమీపముననే యున్నది.

ఈ వంశస్థులలో మాధవవర్మ మహారాజు సుప్రసిద్ధుడు. ఈతడు ఏకాదశాశ్వమేధావబృధావధూత జగత్కల్మషుడు! "అగ్నిష్టోను సహస్రయాజి" కాని మాధవవర్మ పేరుగల పలురాజులుండుటచేత అసలు "మాధవవర్మ" ఎవరని చరిత్రకారులు వాదోపవాదములు చేయుచునే ఉన్నారు. శాలంకాయనులు క్రీ॥శ 5వ శతాబ్ది చివరినుండి ఏడవ శతాబ్ది పూర్వార్థమువరకు రాజ్యము చేసినట్లు భావించవచ్చును. మాధవవర్మను గూర్చి మనోజ్ఞమైన కథలెన్నియో జనశ్రుతిలో ప్రచారములో నున్నవి.

ఆ మహారాజు "ధర్మఘంట" నిర్మించెను. ఒకనాడు యువరాజు రథము క్రింద ప్రమాదవశమున ఒక గోవత్సము మరణించినది. గోవువచ్చి నోటితో ధర్మగంట మ్రోగించినదట. మహారాజు గోవత్సమును ఆ రథముపై పెట్టి యువరాజుపై నడిపించుట - యువరాజు మరణము - దేవదుందుభుల మ్రోత - పుష్ప వృష్టి - దేవేంద్రుడు సంతసించి అమృతవృష్టిచే యువరాజును గోవత్సమును

బ్రదికించుట... ఇట్టివే అనేక కథలు శాలంకాయనరాజుల ధర్మతాత్పర్యమునకు ప్రాచీనాంధ్ర సంస్కృతికి ఉద్దీపన విభావములు. మాధవవర్మ రాణి వాకాటక రాజకన్యక చాలమంది ప్రభువులు - మాధవవర్మ సంతతివారమని చెప్పుకొనిరి. విజయనగరాధీశ్వరులైన పూసపాటివారు మాధవవర్మ సంతతివారు. తెలుగు దేశమునందలి రాచవారు మాధవవర్మ వంశజులుగ పరికీర్తితులు. శకవర్షము 514లో క్రీ॥శ॥ 592 సంవత్సరమున అతడు రాజ్యము సల్పినట్లు బెజవాడ మల్లేశ్వరస్వామి దేవాలయములోని ఒక శాసనము పేర్కొనుచున్నది.

**పల్లవులు**

ఇక్ష్వాకుల తరువాత కృష్ణాతీరమున రాజ్యము చేసినది పల్లవులు. కొందఱు కృష్ణాతీరమందలి పల్లవులకు, శాతవాహనుల కాలమున ఉత్తరమున విదేశీయులు కన్పించు పహ్లవులకు ముడిపెట్టుచున్నారు. ఆ పహ్లవులకును ఈ పల్లవులకును "నామసాదృశ్యము" తప్ప సంబంధము లేదని శ్రీనేలటూరి వేంకటరమణయ్యగారి అభిప్రాయము. కంచి రాజధానిగా దక్షిణాపథమున సువిశాల సామ్రాజ్యము నేలిన ఆపల్లవులు ఎవరు? అను సంప్రశ్నమేర్పడినది.

పల్లవులను గూర్చి, సుగృహీతనామధేయులు సుప్రసిద్ధ చరిత్రకారులైన శ్రీనేలటూరి వేంకటరమణయ్యగారి వివరణము మిక్కిలి అర్థవంతమైనది.

1. "పురాణములలో పల్లవులు ఆంధ్రులతో జోడింపబడుట.
2. పల్లవుల చరిత్రలో - ప్రప్రథమమున వారు ఆంధ్రదేశమును పరిపాలించుట
3. వారి వంశమునకు చెందిన నాలుగు కోవలవారు ఆంధ్రదేశము నందే ఉత్పత్తియగుట.
4. ప్రాచీన తమిళ గ్రంథములు వారిని తమిళులకంటె భిన్నులైన విదేశీయులుగా పరిగణించుట.

ఈ కారణముల వలన పల్లవులు ద్రావిడ దేశమున రాజ్యము సంపాదించి కాలక్రమమున అరవవారితో కలిసిపోయిన ఆంధ్రదేశస్థులని ఎంచదగియున్నది". పల్లవులు నాగరాజు సంతతివారనిచెప్పుకొనిరి. ఈనాగరాజు శాతవాహనచక్రవర్తి పులోమావి III సేనాపతియైన స్కంధనాగుడని చరిత్రకారుల అభిప్రాయము. వీరు అశ్వత్థామకు నాగకన్యకు జన్మించినవారని చెప్పుకొనిరి. అర్వాచీన పల్లవులు తాము బ్రహ్మక్షత్రియులమని చెప్పుకొనిరి. పల్లవులలో సుప్రసిద్ధుడైన త్రిలోచన పల్లవుడు శ్రీశైలపర్వత విపిన భాగములను జనపదములుగా మార్చినట్లు చెప్పబడినది. అనంతరము బళ్లాం కోలారు ప్రాంతముల నేలిన నొలంబు పల్లవులు తాము త్రిలోచన పల్లవుని సంతతి వారమని చెప్పుకొనిరి. ఇతని కాలమున చోళదండయాత్ర వచ్చినది. ఆచోళులలో ఒక శాఖ రేనాడు (కడప మండలము)లో రాజ్యమేర్పరచి తామరతంపరగ అభివృద్ధిచెంది, నెల్లూరు మున్నగు చోట్ల పరిపాలించి తెలుగు సంస్కృతిలోలీనమైరి. వీరిని చరిత్రకారులు తెలుగు చోళులని వర్ణించుచున్నారు. తిక్కన మహాకవి తెలుగు చోడ ప్రభువైన మనుమ సిద్ధి - నెల్లూరు మహారాజు మంత్రి. పల్లవుల శిల్పము నేటికిని మహాబలి పురమున కాననగును. వీరికి పశ్చిమ చాళుక్యులకు పలుమారులు ఘోర సంగ్రామములు జరిగినవి. విజయలక్ష్మి ఉయ్యాల ఊపుగ ఇటునటు పలుసారులు ఊగుచు వినోదించినది.

# చాళుక్య సామ్రాజ్యము

శాతవాహనసామ్రాజ్యము తరువాత తెలుగుదేశమును సుమారు ఐదు శతాబ్దాలు పరిపాలించినది తూర్పు చాళుక్యరాజులు. చాళుక్యవంశజులు తామర తంపరగా వర్థిల్లి దక్షిణాపథములో పలురాజ్యములు పరిపాలించినారు.

1. బాదామిచాళుక్యులు : బాదామి (లేక వాతాపి) రాజధానిగా పరిపాలించిన వారు. వీరికి పశ్చిమ చాళుక్యులు అని చరిత్రలో పేరు. ఈ వంశములో రెండవ పులకేశి చక్రవర్తి సుప్రసిద్ధుడు. ఇతడు శ్రీహర్ష చక్రవర్తి నోడించిన మహావీరుడు.

2. తూర్పు చాళుక్యులు : రెండవ పులకేశి చక్రవర్తి తమ్ముడు కుబ్జవిష్ణువర్ధనుడు తూర్పు చాళుక్యవంశ మూలపురుషుడు. క్రీ॥శ॥ 6వ శతాబ్దమధ్యలో ఈతడు కృష్ణా-గోదావరీమధ్య ప్రాంతములనున్న వేంగికి రాజ ప్రతినిధియై పరిపాలన ప్రారంభించినాడు.

3. కల్యాణి చాళుక్యులు : కల్యాణనగరము రాజధానిగా వీరు పశ్చిమచాళుక్యులపిమ్మట రాజ్యమేలినారు. తొలుత కాకతీయులు వీరికి సామంతులు.

4. వేములవాడ చాళుక్యులు : కరీంనగరము మండలములోని వేములవాడ ప్రాంతమునేలినవారు.

5. ముదిగొండ చాళుక్యులు : మంచికొండసీమకు రాజులుగా పరిపాలించినారు.

6. లాటచాళుక్యులు : గుజరాతు ప్రాంతమును పరిపాలించినారు.

వీరందరు బాదామికుదురుకు చెందినవారే.

క్రీ॥శ॥ 624 సంవత్సరమున రెండవపులకేశి పూర్వ దిగ్విజయయాత్రచేసి వేంగీ కళింగములను జయించి తన తమ్ముడైన కుబ్జవిష్ణువర్ధనుని ఆ దేశములకు పట్టాభిషేకము గావించెను. పూర్వ చాళుక్యరాజయుగమునకు ఆంధ్రచరిత్రకు ఆంధ్రసంస్కృతికి అవినాభావ సంబంధమేర్పడినది. దానికి ముఖ్యకారణము ఆంధ్రుల మాతృభాషయైన 'తెలుగు'నకు చాళుక్యులు కల్పించిన దోహదము.

మును మార్గకవిత లోకం
బునవెలయగ దేశికవితఁబుట్టించి తెనుం
గుననిలిపి రంధ్రవిషయంబున
జనసత్యాశ్రయునిదొట్టి చాళుక్యనృపుల్

చివరిపాదమునకు

జనచాళుక్యరాజు మొదలుగపలువుర్

అను పాఠాంతరమున్నది.

జన+సత్య (ఆశ్రయుడు) = జనాశ్రయ సత్యాశ్రయ బిరుదాంకితుడు అయిన చాళుక్యరాజని అర్థము.

స్వస్థాన వేషభాషలందభిమానముతో చాళుక్య యుగమున ప్రారంభమైన ఆంధ్రసంస్కృతీ పునర్వికాస మహోద్యమము శ్రీ రాజరాజనరేంద్రుని ఆస్థానకవియైన నన్నయభట్టు కాలమున ఆంధ్ర మహాభారతావరణముతో పరాకాష్టనందినది. పూర్వ చాళుక్యులలో మొదటిరాజు కుబ్జవిష్ణువర్ధనుని రాణి అయ్యణ మహాదేవి బెజవాడలో కవుదూరుగణమునకుచెందిన సన్యాసులకొరకు నడుంబి వసతియను జైనమందిరమును కట్టించెను. దీనినిబట్టి రాజైన కుబ్జవిష్ణువర్ధనుడు విష్ణుభక్తుడుకాగా, రాణి జైనమతస్థురాలని – నిర్ణయింపలేము. కుబ్జవిష్ణువర్ధనుడే కార్తికేయాది దైవములకు దానచేసినాడు. ఇది ఆంధ్ర సంస్కృతిలోని సహన సమన్వయములకు ఉదాహరణ పౌనఃపున్యము.

కుబ్జవిష్ణువర్ధనునితో క్రీ॥శ॥ 640 సంవత్సరమున ఆరంభించిన తూర్పు చాళుక్యరాజవంశము వేంగీరాజ్యమును రాజరాజనరేంద్రునిపుత్రుడైన కులోత్తుంగుని చివరవరకు క్రీ॥శ॥ 1118 సంవత్సరముల వరకు పరిపాలించినది.

తెలుగుభాషను ఆంధ్రవిషయమున నిలిపిన ఖ్యాతి చాళుక్యులకు దక్కినది. చాళుక్యుల కాలమున రాజభాష సంస్కృతమేయైనను, తెలుగునకు సముచిత ప్రాధాన్యము దక్కినది. ఇది ఒక మహోద్యమముగా కొనసాగినదనుట గమనింపదగిన గొప్ప విశేషము. శాతవాహనుల కాలములో ఆంధ్రదేశమున రాజభాష ప్రాకృతము. పల్లవులు తొలుత ప్రాకృతమునే ఆదరించినారు. ఇక్ష్వాకులు ప్రాకృతమునే ప్రయోగించినారు. విష్ణుకుండిన శాలంకాయన ప్రభృతులు సంస్కృతమును రాజభాషగాజేసినారు. చాళుక్యులు సంస్కృతముతోపాటు దేశ భాషయైన తెలుగునకు దోహదము కల్పించినారు.

చాళుక్యరాజ్యము గుణగవిజయాదిత్యుని కాలమున మహోజ్జ్వలస్థితినందు కొన్నది. క్రీ॥శ॥ 848 నుండి 892 వరకు వేంగీరాజ్యమును పరిపాలించిన చక్రవర్తి అతడు. 44 సంవత్సరముల ఈతని దీర్ఘపరిపాలనా కాలమును మూడు దశలుగ విభజింపవచ్చును.

1. ప్రథమదశ - అభ్యుదయ దశ
2. ద్వితీయదశ - విపద్దశ
3. తృతీయదశ - విజయపరంపరాభివృద్ధిదశ

ఈతనికి సమకాలీనులు రాష్ట్రకూటప్రభువులు అమోఘవర్ష, కృష్ణమహారాజులు. ఇతడు గుణికె-నల్లాట బిరుదాంకితుడు. ఈతనికిగల గుణపక్షపాతము పౌరుష నామధేయమును సంపాదించిపెట్టినది.

గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడు పేర్కొనదగిన మహావీరుడు, ఈతడు మొట్టమొదట సాధించిన ఘనవిజయము నెల్లూరు ప్రాంతమునందలి

బోయకొట్టములను తూర్పు చాళుక్యరాజ్యములో చేర్చుట. అంతటితో ఆగక పండరంగసేనాని పట్టెము దుర్గమును జయించి నెల్లూరును అగ్నిదగ్ధమొనర్చి, పల్లవరాజ్యమైన తొండైమండలముపై దండెత్తి పులకట్‌వద్ద విజయము సాధించెను.

ఆ పులకట్ సరోవర తీరమున 'పండరంగ' పట్టణమును నిర్మించి అచ్చట పండరంగ మహేశ్వరాలయము కట్టించినాడు. గుణగవిజయాదిత్యుడు పండరంగని అభినందించి అతనిని కందుకూరుసీమకు అధినేతను చేసినాడు. అతడు కందుకూరును అపరబెజవాడగ తీర్చిదిద్దినాడు. దానితో వేంగీసామ్రాజ్యము నెల్లూరువరకు విస్తరించినది.

కాని తాత్కాలికముగ - రాష్ట్రకూటులు దండెత్తి వచ్చుటచే గుణగ విజయాదిత్యుడు అమోఘవర్ష మహారాజుతో సంధిచేసికొని అతనికి సామంతునిగ కొంతకాలముండవలసి వచ్చినది. అమోఘవర్షుని కొడుకు వేంకట కృష్ణరాజు క్రీ॥శ॥ 880 సం॥న రాజయ్యెను ఆ యవకాశమును జారవిడువక గుణగ విజయాదిత్యుడు స్వాతంత్ర్యము ప్రకటించినాడు. కృష్ణరాజు వేంగిపై దండెత్తివచ్చి గుణగ విజయాదిత్యునిచే పరాభూతుడై, బావమరదియైన సంకిలుని రాజధాని కిరణపురమునకు ప్రవాసియై తలదాచుకొనెను.

పండరంగని ఉత్తర దిగ్విజయయాత్ర : గుణగవిజయాదిత్యుడు- దూర దేశమున డాహలరాజధాని కిరణపురములో తలదాచుకొన్న రాష్ట్ర కూట ప్రభువు కృష్ణరాజుపై పగసాధించుటకు పండరంగ సేనానినాయకత్వమున చాళుక్య సైన్యమును పంపించెను. ఆంధ్రదేశ చరిత్రలో తూర్పుచాళుక్యవంశ చరిత్రలో చిరస్మరణీయమైన ఆ మహోజ్జ్వల దండయాత్రనుగూర్చి విపులవర్ణన లభింపక పోయినను, దొరికిన శాసనాధారములనుబట్టి చూచినచో అది పండరంగ సేనాని సాధించిన అసాధారణమైన ఘనవిజయము అని చెప్పవచ్చును. ఆ దండయాత్ర వేంగినుండి బయలుదేరినది. కళింగముదాటి దక్షిణకోసలనుదాటి మధ్య భారతమునందలి మైదానములను చాళుక్యసేనలు చేరుకొన్నవి. అయిన - ఆ

కల్గించినది.

"ఏలినవారు చిత్తగించెదరుగాక.

నేను ఢిల్లీశ్వరుని మెప్పించుటకై గానము చేయుచున్నాను.

మా గురుదేవులు జగదీశ్వరుని కీర్తించుటకై గానము చేయుచున్నారు." ఆ సమాధానము వ్యాఖ్యాన నిరపేక్షమైనది.

త్యాగరాజు జగదీశ్వరుని ఆస్థాన సంగీత విద్వాంసుడు.

గాంధీమహాత్ముడు అన్నాతురునకు పరమేశ్వరుడు అన్నరూపములో తప్ప సాక్షాత్కరింపలేడని నుడివినాడు. గాయకునకుపరమేశ్వరుని సాక్షాత్కారము కలిగినచో నాదబిందు కళారూపములోనే, త్యాగరాజు నాదబిందు లయాస్వరూపుని సాక్షాత్కరింపజేసుకొనిన మహానుభావుడు. యథార్థమునకు త్యాగరాజు గాయకుడుకాడు. గానమే. త్యాగరాజు ఆంధ్రుడగుట ఆంధ్రుల అదృష్టము.

ఆంధ్రలలితకళ లన్నిటికిని సకారత్రయముగా పేర్కొనదగిన సౌష్టవము - సౌకుమార్యము - సౌందర్యములకు అంతర్లీనమైన చైతన్యమే ఆద్యప్రకృతి. ఆ చైతన్యమునకే "తెలుగు వెలుగు" పర్యాయపదము.

తెలుగు వెలుగు ఆంధ్ర శిల్పకళలలో నిద్రాణమై పవళించినది. ఆంధ్రచిత్రలేఖన కళలో ఆ నిదురలో తియ్యని కలలు కన్నది. ఆంధ్రసంగీతకళలో కనులువిప్పి మేల్కొని కంఠము సవరించి ఆలపించినది. ఆంధ్రనృత్యకళలో లేచి నిల్చి నడయాడుట కుపక్రమించినది. ఆంధ్రకవితాకళలో విశ్వాంతరాల మెల్ల విహరింపసాగినది.

"రసో వై సః"

సంగీతార్ద్రా! మధుర సధునీ! కావ్యలావణ్యపూర్ణా!

త్యాగబ్రహ్మప్రగదిత మహాగానసామ్రాజ్యరాజ్ఞీ!
శ్రీమన్నాగార్జున నగకళా శిల్ప సాహిత్యధాత్రీ!
విశ్వాదర్మా! విజయతు విశాలాంధ్ర పృథ్వీమతల్లీ.



నండూరి రామకృష్ణమాచార్యులు